
ఈనాడు
అమరావతి
గుంటూరు
శనివారం అక్టోబరు 5, 2024

వేదమూర్తి.. విశ్వదీప్తి

- గాయత్రీ దేవిగా దుర్గమ్మ దర్శనం
- ఇంద్రకీలాద్రిపై ఘనంగా రెండో రోజు వేడుకలు
- ఉదయం నుంచి భారీగా పోటెత్తిన భక్తులు



ఈనాడు, అమరావతి - న్యూస్‌టుడే, ఇంద్రకీలాద్రి, భవానీపురం, చిట్టినగర్

విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా వేడుకలు రెండో రోజు ఘనంగా జరిగాయి. దుర్గమ్మ శ్రీగాయత్రీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చింది. శుక్రవారం కావడంతో ఉదయం నుంచి భక్తులు పోటెత్తడంతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. తెల్లవారు జామున 4 గంటల నుంచి భక్తులను దర్శనాలకు అనుమతించారు. రాత్రి 11గంటల వరకూ దర్శనాలు కొనసాగాయి. రెండో రోజు 80 వేల మందికి పైగా భక్తులు తరలివచ్చి శ్రీగాయత్రీదేవి రూపంలోని అమ్మ వారిని దర్శించుకున్నారు. మొదటి రోజు ప్రసాదాలు, దర్శనాలు, పూజల ద్వారా రూ.28 లక్షల ఆదాయం ఆలయానికి సమకూరినట్టు అధికారులు ప్రకటించారు.

క్యూలైన్లలో నడిచి.. రెండు కిలోమీటర్ల దూరం వస్తుండడంతో వారికి మధ్యలో మంచినీటి బాటిళ్లు, పిల్లలకు వేడి పాలు అందజేస్తుండడంపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

★ సామాన్య భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టామని కలెక్టర్ జి.సృజన వెల్లడించారు. క్యూలైన్లలో వస్తున్న భక్తులతో ఆమె మాట్లాడారు. దర్శనం ఆలస్యం అవుతోందని కొందరు భక్తులు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. దీంతో అధికారులతో మాట్లాడి.. ఎందుకు ఆలస్యం అవుతోందని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. శుక్రవారం కావడంతో రద్దీ ఎక్కువగా ఉందని దుర్గగుడి అధికారులు తెలిపారు. ఆలస్యం జరగకుండా దర్శనాలు చేసుకునేలా చక్కదిద్దాలని ఆమె సూచించారు.


క్యూలైన్లలో కిక్కిరిసిన భక్తులు

నేడు అన్నపూర్ణాదేవిగా..

దుర్గమ్మ ఉత్సవాల మూడో రోజు శనివారం అన్నపూర్ణాదేవి రూపంలో దుర్గమ్మ భక్తులకు దర్శనమివ్వనుంది. సకల జీవులకు అన్నం ప్రసాదించే దేవత అన్నపూర్ణాదేవి. అన్నం పరబ్రహ్మ స్వరూపం, అన్నం స్వరజీవనాధారం, అన్నం లేనిదే జీవులకు మనుగడ లేదు. అన్నపూర్ణాదేవి ఎడమ చేతిలోని బంగారు పాత్రలో ఉన్న అమృతాన్నం, వజ్రాలు పొదిగిన గరిటెతో తన భర్త అయిన ఈశ్వరునికి భిక్షను అందించే అంశం అద్భుతం. సర్వ పుణ్య ప్రదాయకం. లోకంలో జీవుల ఆకలిని తీర్చటం కన్నా మిన్న ఏదీ లేదు. నిత్యాన్నదానేశ్వరి అలంకారంలోని దుర్గమ్మను దర్శించుకుంటే అన్నాదులకు లోపం లేకుండా, ఇతరులకు సైతం అన్నదానం చేసే సౌభాగ్యాన్ని పొందుతారనేది భక్తుల ప్రగాఢ విశ్వాసం.

★ దర్శన సమయం: ఉదయం 4 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు

ముగిసిన క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

ఈనాడు డిజిటల్, అమరావతి: తిరుపతిలోని స్విమ్స్ శ్రీబాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో మహిళా ఉద్యోగులకు పింక్ బస్ ద్వారా రెండు రోజుల పాటు నిర్వహించిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు శుక్రవారంతో ముగిసాయి. బ్లాక్ నంబరు 3లోని మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం హాల్లో ఉద్యోగినులు పరీక్షలు చేయించుకున్నారు.

తప్పులెన్నువారు.. తమ తప్పులెరగరా?

- సూత్రధారులను వదిలేసి చిరుద్యోగులకు షోకాజ్‌లు
- గ్రీన్‌గ్రేస్ అపార్ట్‌మెంట్ వ్యవహారంలో జీఎంసీ తీరు

ఈనాడు - అమరావతి

గుంటూరు నగరంలో వైకాపా నాయకుడు అంబటి మురళీకృష్ణకు చెందిన గ్రీన్‌గ్రేస్ అపార్ట్‌మెంట్ నిర్మాణంలో నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి బాధ్యులపై చర్యలు తీసుకోవడానికి నగరపాలక సంస్థ ఉన్నతాధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఐదంతస్తులకు అనుమతులు పొంది అంతకుమించి నిర్మించడాన్ని గుర్తించిన రైల్వేశాఖ తానిచ్చిన ఎన్‌వోసీని రద్దు చేస్తూ జీఎంసీకి సమాచారం ఇవ్వడం, ఈ లేఖను పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు మాయం చేయడం తెలిసిందే. దీనిపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని నగర ప్రణాళికాధికారి రాంబాబును కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించి 20 రోజులైంది. ఈ లేఖ వ్యవహారాన్ని టీపీఎస్‌లు హృదయరాజు, రిజ్వానా దాచేసిన విషయం సీపీ విచారణతోపాటు కమిషనర్ పరిశీలనలోనూ తేలింది. దీన్ని తీవ్రంగా పరిగణించి వారిపై చర్యలు తీసుకోవాల్సిందిపోయి.. ప్రణాళిక విభాగం సూపరింటెండెంట్, గుమస్తాలకు షోకాజ్ నోటీసులిచ్చి వివరణ కోరడం వెనుక గూడుపుఠాణి నడుస్తోందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. .


వివాదాస్పదమైన గ్రీన్‌గ్రేస్ అపార్ట్‌మెంట్

బాధ్యులను వదిలి....

అసలు అనుమతుల్లేకుండా అన్ని అంతస్తులు నిర్మిస్తుంటే సీపీ, డీసీపీ, ఏసీపీ, టీపీఎస్‌లు ఏం చేస్తున్నారు? ఈ నిర్మాణాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించి ఉల్లంఘనలను కమిషనర్‌కు నివేదించకుండా ఏం చేశారు? వీరు కఠినంగా వ్యవహరించి ఉంటే.. ఆ నిర్మాణం ముందుకు సాగేదా? ఈ వ్యవహారంలో సూత్రధారులు.. పాత్రధారులు అందరూ ప్రణాళిక విభాగానికి చెందిన అధికారులైతే.. ఇందుకు భిన్నంగా చిరుద్యోగుల వివరణ కోరడమేమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. తపాలా సెక్షన్ నుంచి సంతకం పెట్టి టీపీఎస్ హృదయరాజు, ఆన్‌లైన్ ద్వారా మరో టీపీఎస్ రిజ్వానా ఆ లేఖను తీసుకున్నాక.. బాధ్యతగా కమిషనర్‌కు తెలియజేయాల్సింది పోయి గోప్యంగా ఉంచడం తీవ్రంగా పరిగణించాల్సిన విషయం. కానీ.. కిందిస్థాయి సిబ్బందిపైకి నెపం నెట్టేయాలనుకోవడం వెనుక ఏదో జరుగుతోందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

విజిలెన్స్ విచారణకు ఆదేశిస్తారా?

జీఎంసీ కమిషనర్ బాధ్యులను సస్పెండ్ చేసి ర్యాటిఫికేషన్ కోసం డైరెక్టర్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్‌కు లేఖ రాయొచ్చు. ఇదీ కాదనుకుంటే.. విజిలెన్స్ విచారణ కోరవచ్చు. కానీ.. జీఎంసీ ఉన్నతాధికారులు అంత వేగంగా స్పందించడం లేదు. టీపీఎస్ రిజ్వానాను తాజాగా సత్తెనపల్లికి బదిలీ చేయగా.. హృదయరాజు ఏడెనిమిది మాసాల క్రితమే పిడుగురాళ్ల వెళ్లిపోయారు.

రోడ్డు భద్రతకు అధిక ప్రాధాన్యం

జేటీసీగా బాధ్యతలు స్వీకరించిన శివరామ్‌ప్రసాద్

పట్టాభిపురం, న్యూస్‌టుడే: రవాణా శాఖ పరంగా వాహనచోదకులకు మరింత మెరుగైన సేవలందిస్తామని రీజనల్ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఎన్.శివరామ్‌ప్రసాద్ స్పష్టం చేశారు. గుంటూరు రీజనల్ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌గా ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ జేటీసీగా విధులు నిర్వర్తించిన కృష్ణవేణి తిరుపతికి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో విజయవాడ జేటీసీ శివరామ్‌ప్రసాద్‌ను ప్రభుత్వం నియమించింది. ఆయన గతంలో నెల్లూరు, కర్నూలు, అనంతపురంలలో డీటీసీగా సేవలందించారు. శ్రీకాకుళంలో విధులు నిర్వర్తించే సమయంలో జేటీసీగా పదోన్నతి లభించింది.



గుంటూరులో బాధ్యతలు స్వీకరించిన శివరామ్‌ప్రసాద్ మాట్లాడుతూ రవాణా శాఖ అందిస్తున్న ఆన్‌లైన్ సేవలపై ప్రజలకు మరింత అవగాహన కల్పిస్తామన్నారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు, రహదారి భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. తరచూ డ్రైవర్లకు శిక్షణ ఇవ్వడంతో పాటు అవగాహన కల్పిస్తామన్నారు. ఓవర్‌లోడింగ్, అధిక వేగం, డ్రంక్ అండ్ డ్రైవ్, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గుంటూరు డీటీసీ షేక్ కరీం, ఇన్‌ఛార్జి ఆర్టీఓ గోపాల్, ఎంవీఐలు తదితరులు జేటీసీకి శుభాకాంక్షలు తెలిపారు.

మరో జాతీయ రహదారి వచ్చేస్తోంది!

- కొండమోడు - పేరేచర్ల రహదారి విస్తరణకు మోక్షం
- మోర్త్ ఆమోదంతో తొలగిన అడ్డంకులు

మార్గం	: కొండమోడు - పేరేచర్ల రహదారి నాలుగు వరుసలకు విస్తరణ
దూరం	: 49.9 కిలోమీటర్లు
అంచనా వ్యయం	: 1032.52 కోట్లు
గుత్త సంస్థ	: రాజేంద్రసింగ్ బేంబూ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్

ఈనాడు - అమరావతి

కొండమోడు - పేరేచర్ల రహదారి విస్తరణకు అడ్డంకులు తొలగిపోయాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో భారత్‌మాల కింద మంజూరైన ఈ విస్తరణ పనులు నిధులు విడుదలకాక ప్రారంభం కాలేదు. చివరికిది పట్టాలెక్కుతుందా? లేదా? అన్నదానిపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల రాష్ట్ర ఆర్‌అండ్‌బీ మంత్రి జనార్దన్‌రెడ్డి.. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి భారత్‌మాల రోడ్లను జాతీయ రహదారుల సాధారణ కార్యక్రమం కింద కొనసాగించాలని కోరారు. కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ (మోర్త్) స్టాండింగ్ ఫైనాన్స్ కమిటీ 8 రోడ్లకు అంగీకారం తెలిపింది. ఈ జాబితాలో కొండమోడు - పేరేచర్ల మార్గం ఉండడంతో నిధుల విడుదలకు మార్గం సుగమమైంది.

గుంటూరు నుంచి హైదరాబాద్ మార్గంలో పేరేచర్ల నుంచి కొండమోడు వరకు రహదారిని విస్తరించాలన్నది దశాబ్దాల కల. ఇది అద్దంకి - నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారితో కొండమోడు వద్ద అనుసంధానమై తెలంగాణ వెళ్లేవారికి అనుకూలంగా ఉంటుంది. గుంటూరు నుంచి పల్నాడు వైపు వెళ్లేవారికి కొండమోడు కీలక మార్గం.

★ ఈ మార్గం ప్రాధాన్యం దృష్ట్యా కొండమోడు నుంచి గుంటూరు సమీపంలోని పేరేచర్ల వరకు జాతీయ రహదారి (167 ఏజీ)గా కేంద్రం గుర్తించింది.

★ గత వైకాపా ప్రభుత్వ హయాంలో కేంద్రం ఓకే చేసినా... సకాలంలో భూసేకరణ చేయకపోవడంతో పనులు ముందుకు కదల్లేదు.

★ నిధులు విడుదల చేయాలని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తరఫున నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, రాష్ట్ర ఆర్‌అండ్‌బీ మంత్రి జనార్దన్‌రెడ్డి కోరగా కేంద్రం సానుకూలంగా స్పందించింది.


విస్తరించనున్న కొండమోడు రహదారి

★ ఈ రహదారి 7 నుంచి 10 మీటర్ల వెడల్పుతో ఉంది. రద్దీ పెరిగి ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. ఇంధన వృథా ఎక్కువవుతోంది.

★ విస్తరణ పూర్తయితే హైదరాబాద్ నుంచి నూతన రాజధాని అమరావతికి ప్రయాణ సమయం తగ్గుతుంది. సీఆర్‌డీఏ నిర్మించే బాహ్య వలయ రహదారికి సత్తెనపల్లి వద్ద ఇది అనుసంధానమవుతుంది.

భూసేకరణ ప్రక్రియ పూర్తి

ఈ రహదారి విస్తరణకు గుంటూరు, సత్తెనపల్లి ఆర్డీవోల పరిధిలో 234 హెక్టార్ల భూమి సేకరించాలి. సర్వే పూర్తి చేసి ప్రభుత్వ, ప్రైవేటు, అసైన్డ్, పోరంబోకు భూములను అధికారులు గుర్తించారు. భూసేకరణ ప్రక్రియ పూర్తి చేసిన రాష్ట్రం కేంద్రానికి నివేదించింది. నిధులు రాగానే రైతుల ఖాతాల్లో జమ చేసి భూములను గుత్తేదారుకు అప్పగిస్తారు.

★ నాలుగు వరుసల విస్తరణలో ఒక్కోవైపు 8.75 మీటర్ల వెడల్పుతో రహదారి, 1.5 మీటర్ల వెడల్పుతో డివైడర్, రెండువైపులా మార్జిన్లు కలిపి 22.5 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తారు. మేడికొండూరులో 4 నుంచి 5 కిలోమీటర్ల మేర, సత్తెనపల్లిలో 11 కిలోమీటర్ల బైపాస్‌లు నిర్మించాల్సి ఉంది.

పీఎం కిసాన్ సొమ్ము జమ నేడు

ఈనాడు, అమరావతి: పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన కింద కేంద్ర ప్రభుత్వం 18వ విడత నిధులను శనివారం రైతుల ఖాతాలకు జమ చేయనుంది. గుంటూరు జిల్లాలో 86,674 మందికి 17.33 కోట్లు రానున్నాయి. పీఎం కిసాన్ పథకం కింద అర్హులైన రైతులకు ఏటా మూడు విడతల్లో రూ. 6 వేల చొప్పున కేంద్రం ఇస్తోంది. ఈ ఏడాది రెండో విడత కింద తాజాగా రూ. 2 వేల చొప్పున మంజూరు చేసింది. ఈ సొమ్ము జమ కావాలంటే రైతులు బ్యాంకు ఖాతాను ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాల్సి ఉంది.

గుంటూరు నగర సమగ్రాభివృద్ధికి...

నిర్దిష్ట కాలపరిమితితో ప్రణాళికలు

- స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రజా కమిటీల ఏర్పాటు
- కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

> సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడంతోపాటు అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేసేందుకు ప్రజా సహకారం అవసరం. వారి నుంచి సలహాలు, సూచనలు స్వీకరించేందుకు ఆయా ప్రాంతాల్లో ప్రజా కమిటీలు ఏర్పాటు చేయాలి. ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రహదారులకు వెంటనే మరమ్మతులు పూర్తి చేయాలి. కొత్త లేయర్ వేయాల్సి వస్తే వెంటనే వేసేలా చర్యలు తీసుకోవాలి. రానున్న 30 - 40 రోజుల్లో రహదార్లు, పారిశుద్ధ్య పరిస్థితుల్లో పూర్తి మార్పు కనిపించాలి. పారిశుద్ధ్య పనుల కోసం సిబ్బందిని తీసుకోవడంతోపాటు, నాలుగుచోట్ల గార్బేజి ట్రాన్స్‌ఫర్ స్టేషన్స్ (జీటీఎస్) ఏర్పాటు చేస్తున్నాం. 15వ ఆర్థిక సంఘం నుంచి వచ్చిన రూ. 24 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాలి.
>
> - కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్


సమీక్షలో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్. చిత్రంలో కలెక్టర్ నాగలక్ష్మి, జీఎంసీ కమిషనర్ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు నసీర్, రామాంజనేయులు తదితరులు

> ★ గుంటూరులో ప్రధాన రహదారులతోపాటు రద్దీ ప్రాంతాల్లో ఏర్పడిన గోతులను యుద్ధప్రాతిపదికన మరమ్మతులు పూడ్పిస్తున్నాం. పారిశుద్ధ్యం కోసం మరో వంద ఈ-ఆటోలను అందుబాటులోకి తేనున్నాం.
>
> - కలెక్టరు నాగలక్ష్మి

నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: గుంటూరు సమగ్ర అభివృద్ధికి అంశాల వారీగా నిర్దిష్ట కాలపరిమితితో ప్రణాళికలు సిద్ధం చేసినట్టు కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జీఎంసీలో రహదారుల అభివృద్ధి, పారిశుద్ధ్యం మెరుగుకు చేపట్టాల్సిన చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించి అధికారులకు సూచనలిచ్చారు. అనంతరం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

★ ఈ నెల 20లోగా రహదారులపై గోతులను పూడ్పించేస్తాం. వార్డు సచివాలయాలవారీగా ప్రజా పర్యవేక్షణ కమిటీలు ఏర్పాటు చేస్తాం.

- జీఎంసీ కమిషనర్ పి.శ్రీనివాసులు

★ గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఈ-ఆటోలు మరమ్మతులకు గురయ్యాయి. వీటిని వినియోగంలోకి తెచ్చి పారిశుద్ధ్యం మెరుగుకు వినియోగించాలి. ప్రజా పర్యవేక్షక కమిటీలు ఏర్పాటు చేసి స్థానిక సమస్యల పరిష్కారం దిశగా ప్రణాళికలు సిద్ధం చేశాం. విలీన గ్రామాల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

- ఎమ్మెల్యేలు నసీర్, రామాంజనేయులు

★ సమావేశంలో ఎమ్మెల్సీలు కె.ఎస్. లక్ష్మణరావు, చంద్రగిరి ఏసురత్నం, జీఎంసీ అదనపు కమిషనర్ ఓబులేసు, డీసీలు శ్రీనివాస్, టి.వెంకటకృష్ణయ్య, డి.శ్రీనివాసరావు, ఎస్‌ఈ శ్యాంసుందర్, సీఎంవోహెచ్ డాక్టర్ శోభారాణి, పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ ఎస్‌ఈ శ్రీనివాస్ ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మరియమ్మ హత్య కేసులో..

నందిగం సురేష్ అరెస్టుపై పోలీసుల తర్జనభర్జన

ఈనాడు, అమరావతి: మరియమ్మ అనే మహిళ కేసులో నిందితుడిగా ఉన్న మాజీ ఎంపీ నందిగం సురేష్ అరెస్టు కోరాలా? వద్దా? అన్న అంశంపై పోలీసులు చాలాసేపు తర్జనభర్జన పడ్డారు. ఈ కేసులో ఆయన్ను అరెస్టు చేసేందుకు అనుమతించాలని గత నెలలోనే తుళ్లూరు పోలీసులు మంగళగిరి న్యాయస్థానంలో పీటీ వారెంట్ దాఖలు చేయగా.. దీనికి కోర్టు గురువారం అనుమతిచ్చింది. దీంతో సురేష్‌ను న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్ విధించాలని కోరేందుకు వారు శుక్రవారం మంగళగిరి కోర్టుకు చేరుకున్నారు. అదే సమయంలో ఆయనకు తెదేపా కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో శుక్రవారం హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసి పోలీసులు ఆలోచనలో పడ్డారు. చివరకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసులు వెనక్కి తగ్గారు. తెదేపా కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో కోర్టు విధించిన రిమాండ్ పొడిగించాలని గురువారం సురేష్‌ను కోర్టుకు తీసుకొచ్చినప్పుడు కొంతమంది ఆయనతో సెల్ఫీలు దిగారు. దీన్ని తీవ్రంగా పరిగణించిన ఉన్నతాధికారులు శుక్రవారం అలాంటివి చోటుచేసుకోకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

డ్వామా పీడీగా శంకర్ బాధ్యతల స్వీకరణ

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్టు డైరెక్టరుగా వి.శంకర్ బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం జిల్లా కల్యాణదుర్గం డీఎల్‌డీవోగా పని చేస్తున్న ఆయన్ను గత సెప్టెంబరులో ప్రభుత్వం బదిలీ చేసింది. శుక్రవారం గుంటూరుస్వశక్తి భవనాల సముదాయంలో పీడీగా విధుల్లో చేరారు. కలెక్టరు ఎస్.నాగలక్ష్మి, సంయుక్త కలెక్టరు ఎ.భార్గవ్ తేజ, డీఆర్వో పెద్ది రోజాని కలిశారు.

రాష్ట్రాన్ని గాడిన పెడుతున్న చంద్రబాబు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: జగన్ అయిదేళ్ల పాలనలో అన్నివిధాలా అధోగతి పాలైన రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తున్నారని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఉమ్మడి గుంటూరు-కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఎన్నికల కార్యాలయాన్ని లక్ష్మీపురంలో శుక్రవారం ప్రారంభించారు. ఆలపాటి మాట్లాడుతూ 'వ్యవస్థలన్నింటినీ జగన్ నిర్వీర్యం చేశారు. రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చారు. దోచుకోవడం, దాచుకోవడమే లక్ష్యంగా పెట్టుకుని అయిదేళ్ల పాలన సాగించారు. రాష్ట్ర ఖజానాను జగన్ ఖాళీ చేసినప్పటికీ చంద్రబాబు సంపద సృష్టించి పేదలకు పంచుతున్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటీ అమలు చేస్తున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న తనను గెలిపించాలి'.. అని కోరారు. మాజీ మంత్రి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో సీట్లు దక్కని నేతలకు చంద్రబాబు న్యాయం చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగా ఆలపాటి రాజాకు ఎమ్మెల్సీగా పోటీ చేసే అవకాశం కల్పించారన్నారు. పట్టభద్రులు అందరూ మద్దతు ఇవ్వాలని కోరారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ మాట్లాడుతూ గత వైకాపా పాలనలో ప్రజలు గుణపాఠం చెప్పినా జగన్ ప్రవర్తనలో మార్పు రాలేదన్నారు. ప్రజలకు మంచి చేస్తున్న చంద్రబాబునూ నోటికొచ్చినట్లు ఆడిపోసుకుంటున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అశోక్‌బాబు, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ కత్తెర క్రిస్టీనా, తెదేపా నాయకులు కోవెలమూడి రవీంద్ర, షేక్ లాల్‌వజీర్, కనపర్తి శ్రీనివాసరావు, చుక్కపల్లి రమేష్, వేములపల్లి శ్రీరాంప్రసాద్, వజ్జా రామకృష్ణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్, పక్కన నక్కా ఆనందబాబు, మహమ్మద్ నసీర్, అశోక్‌బాబు, కోవెలమూడి రవీంద్ర


దేశంలోని పవిత్ర క్షేత్రాలు, పుణ్యనదుల జలాలతో ఏర్పాటు చేసిన శంకుస్థాపన ప్రాంగణం


మ్యూజియం వద్ద కాపలాదారు


చుట్టూ ఏర్పాటు చేసిన నిఘా కెమెరాలు

నిఘా నీడలో రాజధాని శంకుస్థాపన ప్రాంతం

రాజధాని అమరావతి శంకుస్థాపన ప్రాంతం పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ ప్రాంగణంలో నవనగరాల నమూనాలతో మ్యూజియం ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. నాడు రాష్ట్ర నలుమూలల నుంచి జనం ఈ ప్రాంగణ సందర్శన కోసం వచ్చేవారు. వైకాపా ప్రభుత్వం వచ్చాక ఈ ప్రాంతం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. మ్యూజియంలోని నవనగర నిర్మాణ నమూనాలను ధ్వంసం చేశారు. తెదేపా కూటమి ప్రభుత్వం రాగానే ఈ ప్రాంగణాన్ని బాగు చేయించింది. మ్యూజియం చుట్టూ 16 నిఘా కెమెరాలను ఏర్పాటు చేసింది. రోజూ శుద్ధి చేసేందుకు పారిశుద్ధ్య సిబ్బంది, కాపలాదారులను నియమించింది. - ఈనాడు, గుంటూరు

ప్రకృతి వ్యవసాయంతో ఆదాయం మెరుగు

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం ద్వారా రైతుల ఆదాయాన్ని మెరుగుపరిచేందుకు శాస్త్రవేత్తలు, అధికారులు కృషి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ అన్నారు. గుంటూరుకు సమీపంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం లాంఫాం ఆడిటోరియంలో ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మీదేవి అధ్యక్షతన ప్రకృతి వ్యవసాయంపై శుక్రవారం కార్యశాల జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన రాజశేఖర్ మాట్లాడుతూ వ్యవసాయంలో చోటుచేసుకుంటున్న మార్పులు, రైతులు ఎదుర్కొంటున్న సంక్షోభం, ఆత్మహత్యలు వంటి సామాజిక సమస్యలను పరిష్కరించడానికి పునఃసమీక్షించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ సంచాలకుడు ఢిల్లీరావు మాట్లాడుతూ ఆంగ్రూ, రైతు సాధికార సంస్థ సంయుక్తంగా పనిచేసి భూసారాన్ని పెంచడం, వాతావరణ, ఆరోగ్య మార్పులకు పరిష్కారం వెతకడంపై దృష్టి సారించాలన్నారు. రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ విజయ్‌కుమార్ ప్రకృతి వ్యవసాయం గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో ఆంగ్రూ పరిశోధన విభాగం సంచాలకుడు పి.వి.సత్యనారాయణ, రైతు సాధికార సంస్థ ఈడీ శామ్యూల్ ఆనంద్‌కుమార్, సీనియర్ కన్సల్టెంట్లు డి.వి.రాయుడు, రుషి, ఎం.మహేశ్వరి, సీనియర్ రీసెర్చి కన్సల్టెంట్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్

నమ్మకం, నాణ్యత సంగం డెయిరీ లక్ష్యం

పొన్నూరు, న్యూస్‌టుడే: నమ్మకం, నాణ్యత సంగం డెయిరీ ప్రధాన లక్ష్యమని డెయిరీ ఛైర్మన్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పేర్కొన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి సంగం డెయిరీలో శుక్రవారం ఉమ్మడి జిల్లాకు సంబంధించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ డెయిరీలో కల్తీ పదార్థాలను గుర్తించేందుకు కోట్లాది రూపాయలు ఖర్చు చేసి పరికరాలను అందుబాటులోకి తెచ్చామన్నారు. అవసరమైన సమయంలో వివిధ రకాల పరీక్షలు చేస్తున్నామని వెల్లడించారు. రైతుల భాగస్వామ్యంతో ఏర్పడిన సంగం డెయిరీ లాభాల బాటలో పయనిస్తుండగా, గత వైకాపా ప్రభుత్వ మద్దతుతో నడిచిన విశాఖ డెయిరీ నష్టాల బాటలో ఉందని వెల్లడించారు. పాల సొసైటీలతో సంగం డెయిరీని అనుసంధానం చేసే విధంగా తగు చర్యలు తీసుకుంటామని, అందుకు యాప్‌ను కూడా అందుబాటులోకి తీసుకొచ్చే ప్రక్రియకు శ్రీకారం చుట్టామని తెలిపారు. ఈ ఏడాది 17 శాతం పెరుగుదలతో రూ.1,878 కోట్ల టర్నోవర్‌కు చేరుకున్నామని, అందులో రూ.8.80 కోట్లు నికర లాభం సాధించామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో కొన్ని పాల ఉత్పత్తిదారుల కేంద్రాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, సంఘ అధ్యక్షులు నూతన భవన నిర్మాణ పనులకు ప్రతిపాదనలు పంపితే వాటిని పరిశీలించి నిధులు మంజూరు చేసేలా తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సంగం డెయిరీ ఎండీ గోపాల్‌కృష్ణన్, పాలకవర్గ సభ్యులు, అధికారులు, పాల కేంద్రాల అధ్యక్షులు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న సంగం డెయిరీ ఛైర్మన్ నరేంద్రకుమార్, వేదికపై పాలకవర్గ సభ్యులు


ఐఎస్‌వో ధ్రువపత్రం ప్రదర్శిస్తున్న వీసీ ఆచార్య గంగాధర్, ఆచార్యులు

ఏఎన్‌యూకు ఐఎస్‌వో గుర్తింపు

ఏ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఐఎస్‌వో 9001:2015 ధ్రువపత్రం సాధించింది. నిర్వహణ, విద్యాప్రమాణాలు, మౌలిక వసతులు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నందున ఈ ధ్రువపత్రం లభించిందని ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్ చెప్పారు. అభివృద్ధి, నాణ్యత ప్రమాణాలు, విద్యాపరమైన అంశాలను పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ గుర్తింపుతో విశ్వవిద్యాలయం ఖ్యాతి మరింత పెరిగిందని వీసీ వెల్లడించారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య రత్నషీలామని, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, ఆచార్యులు ప్రమీలారాణి, పాల్‌కుమార్, అశోక్‌కుమార్, రవికుమార్, ఐక్యూఏసీ సంచాలకులు కృష్ణ సత్య, డాక్టర్ గోపికృష్ణ, డాక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

మిర్చి వ్యాపారుల ఉదారత

పట్టాభిపురం, న్యూస్‌టుడే: వరద బాధితుల సహాయార్థం గుంటూరు మిర్చి వ్యాపారులు రూ.9 లక్షలు విరాళం అందజేశారు. తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు సమక్షంలో మిర్చి వ్యాపారులు కర్లపూడి వెంకటేశ్వరరావు, కొత్తూరి సుధాకర్, హర్షిత్‌కుమార్, నిమ్మగడ్డ సత్యనారాయణ తదితరులు మంత్రి నారా లోకేశ్‌ను ఇంటి వద్ద కలిసి చెక్కు ఇచ్చారు. మిర్చియార్డును నందమూరి తారక రామారావు వ్యవసాయ మార్కెట్ కమిటీ, గుంటూరుగా సవరణ చేయాలని వెంకటేశ్వరరావు కోరారు.


లోకేశ్‌కు రూ.9 లక్షల చెక్కు అందజేస్తున్న వెంకటేశ్వరరావు, సుధాకర్

ప్రజాదర్బార్‌లో ఫిర్యాదుల వెల్లువ

తాడేపల్లి, న్యూస్‌టుడే: డబుల్ రిజిస్ట్రేషన్ చేసి తాము కొనుగోలు చేసిన స్థలాన్ని వైకాపా ప్రభుత్వం అండతో కబ్జా చేశారని కృష్ణా జిల్లా మెవ్వ మండలం భట్లపెనుమర్రుకు చెందిన సంగిశెట్టి సీతారావమ్మ, మాచర్ల విజయలక్ష్మి, మునగాల మాధవి 'ప్రజాదర్బార్'లో మంత్రి నారా లోకేశ్‌కి ఫిర్యాదు చేశారు. తాడేపల్లి మండలం ఉండవల్లిలో శుక్రవారం నిర్వహించిన 'ప్రజాదర్బార్'లో మంత్రి లోకేశ్‌కి రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి వచ్చిన ప్రజలు వినతిపత్రాలు అందజేశారు. 1995లో వెల్లంకి లక్ష్మీనారాయణ వద్ద స్థలాన్ని కొనుగోలు చేశామని, దానిని ఆ వ్యక్తి వేరొకరికి రిజిస్ట్రేషన్ చేశారని, విచారించి న్యాయం చేయాలని మహిళలు కోరారు. ❖ విజయవాడ బస్‌స్టేషన్‌లో బస్సు దూసుకొచ్చిన ఘటనలో తన ఆరు నెలల కుమారుడు మృతి చెందాడని, ఆ మనోవేదనతో ఉద్యోగాన్ని కోల్పోయానని బాపట్ల జిల్లా జె.పంగులూరుకు చెందిన కాటి యలమంద వినతిపత్రం అందజేశారు. ❖ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు శిక్షణ కోసం స్టడీ సెంటర్ ఏర్పాటు చేయాలని రంపచోడవరానికి చెందిన డాక్టర్ పల్లాల రాజ్‌కుమార్‌రెడ్డి విన్నవించారు. ❖ నకిలీ పత్రాలు సృష్టించి తన భూమి కబ్జా చేశారని సత్యసాయి జిల్లా నామాలకు చెందిన బుక్క పట్టణం రమణమ్మ ఆవేదన చెందారు. ❖ వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్తు కనెక్షన్ ఇవ్వడంలేదని ఏలూరు జిల్లా పెదవేగికి చెందిన రాజబోయిన సీతమ్మ మంత్రి లోకేశ్‌కి వివరించారు.


వినతులు స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేశ్


గృహ నిర్మాణ సంస్థ అధికారులతో సమావేశమైన పెమ్మసాని

అర్హులైన పేదలందరికీ పక్కా ఇళ్లు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: అర్హులైన పేదలందరికీ పక్కా ఇళ్లు అందజేయాలని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆదేశించారు. గృహనిర్మాణ శాఖ అధికారులతో ఆయన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సమావేశమయ్యారు. పెమ్మసాని మాట్లాడుతూ గృహ నిర్మాణ పథకానికి సంబంధించి దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ప్రతినిధుల్ని ఈనెల 21, 22 తేదీల్లో గుంటూరుకు ఆహ్వానిస్తున్నామన్నారు. గ్రామీణ యాప్ ద్వారా గృహ లబ్ధిదారుల సర్వే చేపడుతున్నామని చెప్పారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో గృహ నిర్మాణానికి సంబంధించి అమలవుతున్న సాంకేతికతపై చర్చించి నూతన విధానాన్ని తీసుకురావాలని సూచించారు. గృహ నిర్మాణానికి దాతల సహాయం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రాజబాబు, చీఫ్ ఇంజినీర్ జయ రామాచారి, ఎస్ఈ ప్రసాద్, గుంటూరు జిల్లా హౌసింగ్ హెడ్ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానము – మంగళగిరి, గుంటూరు జిల్లా
సీల్డు టెండరు ప్రకటన

శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానము నందు ది.01.11.2024 నుండి ది.31.10.2025 వరకు అనగా ఒక సంవత్సరకాలమునకు శ్రీ స్వామివారి దేవస్థానముకు అవసరమైన స్వీపర్లను కాంట్రాక్టుగా ఏర్పాటు చేయుటకు సీల్డు టెండర్లను ఆహ్వానించటమైనది. సదరు టెండర్ ఫారములు దేవస్థానం నందు ది.16.10.2024 సాయంత్రం గం॥ 5-00లలోపు రూ.500-00లు చెల్లించి పొందవలయును. కోడ్‌చేసి సీల్డువేసిన టెండర్లను ది.17.10.2024 తేది ఉదయం గం॥ 11-30 లోపు కార్యాలయం నందు ఏర్పాటు చేసిన టెండరు బాక్స్ నందు దాఖలు చేయవలెను. సదరు టెండర్లను అదేరోజు మధ్యాహ్నం గం॥ 12-00లకు హాజరైన టెండర్‌దారుల సమక్షమున సీల్డు టెండర్లు తెరపబడును.

ఇట్లు, సహాయ కమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి

పార్టీ బలోపేతానికి పని చేయాలి

వైకాపా గుంటూరు జిల్లా అధ్యక్షుడు, పరిశీలకుల ప్రమాణ స్వీకారంలో సజ్జల

గోరంట్ల(గుంటూరు), న్యూస్‌టుడే: వైకాపాను బలోపేతం చేసే దిశగా జిల్లా అధ్యక్షుడు, పరిశీలకులను నియమించామని, గ్రామ స్థాయి వరకు అన్ని కమిటీలను నియమిస్తామని వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. గుంటూరు శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో వైకాపా జిల్లా అధ్యక్షుడిగా అంబటి రాంబాబు, పార్లమెంట్ పరిశీలకుడిగా మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి ప్రమాణస్వీకార సభ శుక్రవారం జరిగింది. సభకు జిల్లా మాజీ అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు అధ్యక్షత వహించారు. సజ్జల మాట్లాడుతూ పార్టీలోని భేదాభిప్రాయాలన్నీ పక్కన పెట్టి పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు, నాయకులంతా ప్రణాళికతో పార్టీని నడిపించాలని పిలుపునిచ్చారు. వైకాపా జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు మాట్లాడుతూ అధ్యక్ష పదవిని బాధ్యతగా భావిస్తున్నానన్నారు. మాజీ మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడుతూ ఎప్పుడు ఎన్నికలు జరిగినా తెదేపాను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. మాజీ మంత్రి విడదల రజిని మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం విద్య, వైద్యాన్ని గాలికొదిలేసిందన్నారు. ఎమ్మెల్సీలు మురుగుడు హనుమంతరావు, మర్రి రాజశేఖర్, లేళ్ల అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నంలు మాట్లాడారు. వైకాపా నాయకుడు గౌతంరెడ్డి, నగర మేయర్ మనోహర్‌నాయుడు, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు నూరి ఫాతిమా, అంబటి మురళి, బలసాని కిరణ్‌కుమార్, వేమారెడ్డి, నాయకులు గంజి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సజ్జల రామకృష్ణారెడ్డి, వేదికపై అంబటి రాంబాబు, నాగార్జున, రజిని, అప్పిరెడ్డి తదితరులు

యాప్‌లు కుదించాలని వినతి

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల్లో వివరాల నమోదుకు లెక్కకు మించి యాప్‌లు ప్రవేశపెట్టడంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని, వాటిని కుదించి ఒకేదానిలోకి తీసుకురావాలని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, రాష్ట్ర అంగన్‌వాడీల సిబ్బంది సంఘం ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మలు కోరారు. గుంటూరులో రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సంచాలకుడు ఎం.వేణుగోపాల్‌రెడ్డిని కార్యాలయంలో సంఘ నాయకులు శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. 42 రోజుల సమ్మె కాలంలో అంగీకరించిన మేరకు సమస్యలు పరిష్కరించడంతో పాటు పించన్ల పంపిణీ, బీఎల్వో విధుల నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సుప్రజ, గుంటూరు జిల్లా అధ్యక్షురాలు దీప్తి మనోజ తదితరులు ఉన్నారు.


వీసీ శారద జయలక్ష్మీదేవి సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న నార్మ్, ఆంగ్రూ అధికారులు

ఆంగ్రూ విద్యార్థుల పరిశోధనకు 'నార్మ్' సహకారం

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థులకు పరిశోధన అంశాల్లో సహకారం అందజేసేందుకు హైదరాబాద్‌లోని జాతీయ వ్యవసాయ పరిశోధన నిర్వహణ సంస్థ (నార్మ్) ముందుకొచ్చింది. గుంటూరుకు సమీపంలోని వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవన్ లాంలో.. నార్మ్, ఆంగ్రూ అధికారులు శుక్రవారం ఈ మేరకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆంగ్రూ ఉపకులపతి డాక్టర్.శారద జయలక్ష్మీదేవి సమక్షంలో ఆంగ్రూ రిజిస్ట్రార్ జి.రామచంద్రరావు, నార్మ్ సంచాలకుడు సీహెచ్.శ్రీనివాసరావులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి మార్చుకున్నారు. కార్యక్రమంలో నార్మ్ పీఎంఈ విభాగం అధికారి టి.శ్రీనివాస్, ఆంగ్రూ విభాగాల అధిపతులు పి.వి.సత్యనారాయణ, ఎ.వి.రమణ, బి.శ్రీలక్ష్మి, బి.వి.ఎస్.ప్రసాద్, పి.రవి తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అధికారుల నియామకం

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: అవినీతి నిరోధకశాఖ ఏఎస్పీ కె.సుప్రజను గుంటూరు జిల్లా నేరవిభాగ (క్రైమ్స్) ఏఎస్పీగా శుక్రవారం నియమితులయ్యారు. ఆమె గతంలో గుంటూరు ట్రాఫిక్, తూర్పు సబ్‌డివిజన్, మహిళా పోలీసుస్టేషన్, పరిపాలనా విభాగ ఏఎస్పీగా విధులు నిర్వహించారు. అనేక సంచలనాత్మక కేసులను ఛేదించారు. గుంటూరు జిల్లా శాంతి భద్రతల విభాగం (ఎల్ అండ్ ఓ) ఏఎస్పీగా ఉన్న కొల్లి శ్రీనివాసరావును విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి బదిలీ చేశారు.


సుప్రజ   శ్రీనివాసరావు

సైనైడ్ హత్యల కేసుల్లో పురోగతి

కొల్లిపర, న్యూస్‌టుడే: సంచలనం సృష్టించిన సైనైడ్ వరుస హత్యల కేసుల్లో పురోగతి సాధిస్తున్నామని తెనాలి సీఐ రమేష్‌బాబు తెలిపారు. తెనాలి త్రీటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో సెప్టెంబరు 21వ తేదీన నమోదైన సైనైడ్ హత్యల కేసుల్లో నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసింది. ఈ కేసులో తెనాలి యడ్లలింగయ్య కాలనీలో నివాసముంటున్న కరెవరపు మోషే ఉరఫ్ పీసు (53)ను హత్య చేసినట్టు నిందితులు తెలపటంతో పోలీసులు విచారణ వేగవంతం చేశారు. మోషేది ఆత్మహత్యకాదని, హత్యగా తేలడంతో ఖననం చేసిన మృతదేహాన్ని బయటకు తీసి శుక్రవారం వైద్య బృందం పరీక్ష చేసినట్లు వెల్లడించారు. మృతుడు మోషే స్వగ్రామం కొల్లిపర మండలం హనుమాన్‌పాలెం. అతని భార్య భూదేవి ఫిర్యాదు మేరకు అప్పట్లో కేసు నమోదు చేశామని, విచారణలో ఆమే నిందితురాలుగా గుర్తించామన్నారు. ప్రొఫెసర్ సుజ్ఞాన్, బృంద వైద్యులు, శిక్షణ డీఎస్పీ భార్గవి, తెనాలి తహసీల్దార్ గోపాలకృష్ణ, ఎస్సైలు ప్రకాష్, పి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.


శవపరీక్ష చేస్తున్న వైద్యులు, పక్కన పోలీసులు

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 123, రిటైల్ ధర - 145, చికెన్ విత్‌స్కిన్ - 210, చికెన్ స్కిన్‌లెస్ - 239.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 138, 148 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 535 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.84/-.

స్థానికుల కృషితో రహదారి చదును

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: పట్టణ పరిధి చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూల్ పక్క రోడ్డులో పడిన ప్రమాదకర గుంతల్లో వాహనాలు నిదానంగా నడపాలి. కాదని వేగంగా వెళితే ఆసుపత్రి పాలవడం ఖాయం. వీటిని మున్సిపల్ అధికారులు పూడ్చిస్తారని స్థానికులు ఎంతో కాలం ఎదురు చూశారు. ఇటీవల వారే రంగంలోకి దిగి కూలీలతో వ్యర్థాలు తెప్పించి ఆ గుంతల్లో పోయించి చదును చేయించారు. అప్పటి నుంచి ఆ రోడ్డులో వచ్చి పోయే జనం ప్రమాద తీవ్రతను తగ్గించని కృతజ్ఞతలు తెలుపుకున్నారు.


కూలీలతో చదును చేయిస్తున్న స్థానికులు

తెనాలి
•తెనాలి •పొన్నూరు

స్తంభాలు ఇలా.. రాకపోకలు ఎలా..?

పొన్నూరు పట్టణం 29వ వార్డు ఓం కాలనీలో రహదారి మధ్యలో విద్యుత్తు స్తంభాలు ఉండటంతో స్థానికులు రాకపోకలు నిర్వహించడానికి నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి మధ్యలోని విద్యుత్తు స్తంభాలు మార్చమని గత వైకాపా ప్రభుత్వంలో అనేక సార్లు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. కూటమి నేతలు, అధికారులు జోక్యం చేసుకుని స్తంభాలను మార్చే విధంగా తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

-న్యూస్‌టుడే, పొన్నూరు



మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? పాత పొన్నూరులో రహదారి మధ్యలో పగుళ్లివ్వడంతో రాకపోకలకు చాలా ఇబ్బందికరంగా ఉంది. **- పి.భాను ప్రసాద్**

✔ రహదారికి మరమ్మతులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటా. **-అపర్ణ, సహాయ ఇంజినీర్**

? పట్టణంలోని అంబేడ్కర్‌నగర్‌లో మూడు రోజుల నుంచి చెత్తను తొలగించలేదు. దుర్వాసన రావడంతో ఇబ్బందికరంగా ఉంది. **- ఎన్.డేవిడ్**

✔ చెత్తను తొలగిస్తాం. - శ్రీనివాసరావు, ప్రజారోగ్యశాఖాధికారి

-న్యూస్‌టుడే, పొన్నూరు

వ్యర్థాల తొలగింపు

స్పందనకు వందనం

మేమున్నాం... మీకు తోడుగా శీర్షికన ఈనాడులో ప్రచురితమైన కథనానికి ప్రజారోగ్యశాఖాధికారులు స్పందించారు. బాలాజీనగర్‌లోని మురుగు కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు.

-న్యూస్‌టుడే, పొన్నూరు

పార్కుల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

పొన్నూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని నిడుబ్రోలు, విద్యానగర్, శాంతినగర్, అంబేడ్కర్‌నగర్ పార్కుల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తామని కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణ పరిధిలోని అంబేడ్కర్‌నగర్ పార్కులో పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంపై సచివాలయ సిబ్బందిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిసరాలను శుభ్రపరిచే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

చేరిన ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకుల ధ్రువపత్రాలు

ఏ.ఎన్.యు, న్యూస్‌టుడే: నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్) విడుదల చేసిన ర్యాంకింగ్స్ ధ్రువపత్రాలను శుక్రవారం ఏఎన్‌యూకి పంపించింది. ఓవరాల్ జాతీయ స్థాయిలో 97, విశ్వవిద్యాలయాల జాబితాలో 59, రాష్ట్ర స్థాయిలో 20, ఫార్మసీ కళాశాలకు 63 ర్యాంకులను ఏఎన్‌యూకి కేటాయించింది. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్ మాట్లాడుతూ గతంతో పోల్చుకుంటే ఈ సారి 100లోపు నాలుగు ర్యాంకులను సాధించడమన్నారు. అందరూ కష్టపడి ఈ సారి మరింత మెరుగైన ర్యాంకు సాధనకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, ఇతర విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని తెనాలి రాక నేడు

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెనాలి పట్టణం, మండల పరిధిలోని అభివృద్ధి కార్యక్రమాలు, స్వర్ణాంధ్ర-2047 అంశాలపై శనివారం వేర్వేరుగా నిర్వహించే సమావేశాల్లో పాల్గొననున్నారు. సాయంత్రం జరిగే తెనాలి జిల్లా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలోనూ పాల్గొంటారు.

పెరిగిన పరిహారం.. రైతులకు ఉపశమనం

నాడు పక్షపాతం.. గత ఏడాది డిసెంబరులో మిగ్‌జాం తుపాను ప్రభావంతో నష్టపోయిన రైతులకు హెక్టార్‌కు రూ.17 వేలు పరిహారం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అప్పటి వైకాపా నేతలు నష్టపరిహారం అందించే ప్రక్రియలో పక్షపాత ధోరణితో వ్యవహరించారు. ఉదాహరణకు మన్నవలో 247.70 హెక్టార్లలో వరి పంట దెబ్బతినగా.. అందుకు రూ.41.42 లక్షలు రైతుల ఖాతాలో జమ చేశారు. తెదేపా సానుభూతిపరులు గొల్ల నాగమలేశ్వరరావు, గొల్ల యానాదిరావు, గొల్లపూడి సురేష్, ఎ.రామకృష్ణ, కె.రామారావు తదితరులకు పంట నష్టపరిహారం జమ చేయలేదని వ్యవసాయశాఖాధికారులకు ఫిర్యాదు చేశారు.

నేడు అందరికీ.. ఈ ఏడాది ఆగస్టు నెలలో కురిసిన భారీ వర్షాలు, వరదకు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం హెక్టార్‌కు రూ.25 వేలు పరిహారం అందిస్తామని ప్రకటించడంతో అర్హులందరికీ జాబితాలో చోటు కల్పించారు. ఉదాహరణకు మన్నవలో 1,100 ఎకరాల వరకు వరి పంటకు నష్టం జరగగా. .అందుకు పరిహారం కింద ప్రభుత్వం రూ.1.10 కోట్లు జమ చేసింది. సర్పంచి, వైకాపా నాయకుడు బొనిగల నాగమల్లేశ్వరావు 4.69 ఎకరాలు, వైకాపా నాయకులు బొనిగల వేణుప్రసాద్‌కు 4.81 ఎకరాలు, బొనిగల అమరేంద్ర ప్రసాద్ 4 ఎకరాలకు నష్టపరిహారం జాబితాలో చోటు కల్పించారు.

పొన్నూరు, చేబ్రోలు, పెదకాకాని, న్యూస్‌టుడే: పొన్నూరు నియోజకవర్గంలో ఈ ఏడాది 51,398 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఆగస్టులో కురిసిన భారీ వర్షాలకు 19,956 ఎకరాల్లో పంట దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖాధికారులు గణాంకాలు చెబుతున్నాయి. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్, వ్యవసాయశాఖాధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి జరిగిన నష్టం గురించి ప్రభుత్వానికి నివేదిక రూపంలో అందించారు. ప్రభుత్వం స్పందించి హెక్టార్‌కు రూ.25 వేలు పరిహారం అందిస్తామని ప్రకటన జారీ చేసింది. కూటమి ప్రభుత్వం రైతుల ఖాతాలో పరిహారం జమ చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. కష్టకాలంలోని రైతులకు పరిహారం త్వరగా జమ చేయడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పంట నష్టం, పరిహారం వివరాలు

మండలం	దెబ్బతిన్న పంట ఎకరాలు	పరిహారం (రూ.లలో)
పొన్నూరు	8,460	8,40,60,000
చేబ్రోలు	3,896	3,89,60,000
పెదకాకాని	7,600	7,60,00,000

గత ప్రభుత్వంలో పైసా అందలేదు

గత అయిదేళ్ల వైకాపా పాలనలో అనేక సార్లు పంట నష్టం జరిగింది. ఒక్కసారి కూడా పరిహారం జమ చేయలేదు. అనేక సార్లు వ్యవసాయశాఖాధికారులను కలిసినా పరిహారం అందలేదు. ఆగస్టులో కురిసిన వర్షాలకు ఏడు ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. ప్రభుత్వం పరిహారం కింద రూ.60 వేలు ఖాతాలో వేసింది. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రైతులకు అండగా నిలిచింది.



-పాములపాటి సాయి కృష్ణ, కౌలు రైతు, నిడుబ్రోలు

సీఎంకు అభినందనలు

30 ఎకరాల్లో వరి సాగు చేశా. 1.5 ఎకరాల సొంత పొలం ఉంది. వరద కారణంగా పంట కుళ్లిపోయింది. ప్రభుత్వం నుంచి పంట నష్టపరిహారం పొందేందుకు 10.5 ఎకరాలకు చెందిన భూయజమానులు వారి పొలం పత్రాలు ఇవ్వడంతో నా ఖాతాలోకి రూ.1.30 లక్షలు జమయ్యాయి. త్వరగా పంట నష్టపరిహారం అందేలా చేసిన సీఎం చంద్రబాబు అభినందనీయులు. ప్రకృతి నిండా ముంచినా ప్రభుత్వం ఆదుకోవటం ఉపశమనంగా ఉంది.



-గోపి, వెంకటకృష్ణాపురం, పెదకాకాని మండలం

నాడు ఎదురుచూపులు

2.5 ఎకరాల్లో వేసిన వరి పంట నీట మునిగి నష్టపోయా. నెల రోజులలోపే రూ.20 వేల పరిహారం అందింది. గతంలో ప్రకృతి విపత్తులు వచ్చినప్పుడు ఇంత పరిహారం ఏ ప్రభుత్వం అందించలేదు. ఇచ్చే అర కొర సాయం కోసం నెలల తరబడి ఎదురు చూడాల్సిన ఉండేది. మొదటి పంట నష్టపోయిన బాధలో ఉన్నప్పటికి కొంత మేలు జరిగింది.



-దాసరి శివరామయ్య, శలపాడు, చేబ్రోలు మండలం

ఏసీపీ సుధాకర్ సేవలు ప్రశంసనీయం

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: పట్టణ ప్రణాళికా విభాగ అసిస్టెంట్ సిటీ ప్లానర్ జడ్. సుధాకర్ సేవలు ప్రశంసనీయమని పలువురు ఉద్యోగులు పేర్కొన్నారు. ఆయన బదిలీ సందర్భంగా శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఏసీపీ సుబ్బారావు, టీపీవో సాంబశివరావు, టీపీఎస్ సునీల్, ఉద్యోగులు ఆయన్ను శాలువాతో సత్కరించి, జ్ఞాపిక అందజేశారు.

హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులు

పొన్నూరు, న్యూస్‌టుడే: దసరా పండుగ సందర్భంగా పొన్నూరు నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని ఆర్టీసీ డిపో మేనేజర్ టి.అజితకుమారి శుక్రవారం వెల్లడించారు. ప్రయాణికులు సాధారణ ఛార్జీలు మాత్రమే చెల్లించాలని కోరారు.

అధికారుల బాధ్యతల స్వీకరణ

పొన్నూరు, న్యూస్‌టుడే: పొన్నూరు ఎంపీడీవోగా జి. చంద్రశేఖర్ శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఆయన బాపట్ల జిల్లా రేపల్లె నియోజకవర్గం భట్టిప్రోలు ఎంపీడీవోగా పనిచేస్తూ పొన్నూరుకు బదిలీపై వచ్చారు.


చంద్రశేఖర్

పెదకాకాని, న్యూస్‌టుడే: పెదకాకాని ఎంపీడీవోగా రమావత్ శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కృష్ణాజిల్లా కొండూరు నుంచి ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడటంతో పాటు ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులు త్వరగా పూర్తయ్యేలా చేస్తానని తెలిపారు.


రమావత్ శ్రీనివాస్

క్రమశిక్షణతోనే లక్ష్యసాధన సులువు

చేబ్రోలు: విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యను అభ్యసిస్తే తాము అనుకున్న లక్ష్యాలను సులువుగా చేరుకోవచ్చని ప్రిన్సిపల్ కె.శ్రీదేవి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యాసంవత్సరం కళాశాలలో ప్రవేశం పొందిన విద్యార్థులకు ఆహ్వాన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

కౌలు రైతులకు సాయం అందలేదు

తెనాలి టౌన్: వరద నష్టపరిహారం నేరుగా కౌలు రైతుల ఖాతాల్లోకి చేరుతుందని ప్రభుత్వం ప్రకటించినా, వాస్తవాలు అందుకు భిన్నంగా ఉన్నాయని, కౌలు రైతులు నష్టపోతున్నారని కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు రైతులతో కలిసి శుక్రవారం తెనాలి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అధికారులకు వినతిపత్రం అందించారు. నాయకులు ములకా శివసాంబిరెడ్డి, అప్పారావు, సురేష్‌బాబు, రత్నకిషోర్ పాల్గొన్నారు.


తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేస్తున్న కౌలు రైతులు, సంఘ నాయకులు

ఇసుక అందుబాటులో ఉంచాలని ఆందోళన

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఇసుకను భవన నిర్మాణ అవసరాలకు అందుబాటులో ఉంచాలని సీఐటీయూ నాయకుడు కొల్లిపర బాబూ ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై శుక్రవారం గాంధీ చౌక్ నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయానికి నిర్వహించిన ప్రదర్శనలో ఆయన మాట్లాడారు. ఇసుక లేక 13 రకాల కార్మికులు ఉపాధికి దూరంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. అనంతరం నాయకులు, తాపీ కార్మిక సంఘం కార్యదర్శి శ్రీనివాసరావు, సీఐటీయూ నాయకుడు హుస్సేన్‌వలి, ఫకీర్, అహ్మద్ కృష్ణయ్య, వెంకట్ దాసు సబ్‌కలెక్టర్ సంజనకు వినతి పత్రాన్ని అందించారు.


సబ్‌కలెక్టర్‌కు సమస్యలను వివరిస్తున్న బాబూప్రసాద్ తదితరులు

పెదకాకాని, న్యూస్‌టుడే: ఉచిత ఇసుక వాగ్దానాన్ని వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు నేతాజీ డిమాండ్ చేశారు. పెదకాకాని తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం భవన నిర్మాణ కార్మికులు, సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీతో కలిసి ఆయన ధర్నా నిర్వహించారు.

పొన్నూరు, న్యూస్‌టుడే: పొన్నూరు తహసీల్దారు కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. రెవెన్యూ సిబ్బందికి వినతి పత్రం అందచేశారు. సిపిఎం నాయకుడు నిమ్మకూరు రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

చేబ్రోలు, న్యూస్‌టుడే: సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దండా లక్ష్మీనారాయణ తదితరులు తహసీల్దార్ శ్రీనివాస శర్మకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో చేబ్రోలు మండల కార్యదర్శి ఆదిశేషు, నాయకులు మస్తాన్ వలి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.


పినపాడు: ధనలక్ష్మీదేవిగా ..


గంగానమ్మపేట సాలిగ్రామ విద్యాపీఠంలో జిలేబిలతో..


బాలజీరావుపేట కోదండరామస్వామి ఆలయంలో..


పొన్నూరు వాసవీ కన్యకాపమరేశ్వరి దేవస్థానంలో అన్నపూర్ణదేవిగా


పొన్నూరు: కనకదుర్గా భవానీని బ్రహ్మచారణిగా

శక్తి స్వరూపిణి.. ముక్తిప్రదాయిని

దేవి శరన్నరవరాత్రుల ఉత్సవాలు శుక్రవారం రెండో రోజుకు చేరుకున్నాయి. తెనాలి, పొన్నూరు నియోజకవర్గాల్లోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అన్నపూర్ణాదేవి, ధనలక్ష్మి, హంస గాయత్రి తదితర అలంకారాల్లో అమ్మవారు దర్శనమిచ్చారు. జగన్మాతను దర్శించుకొని భక్తులు పరవశించారు. మహిళలు కుంకుమ పూజలో పాల్గొన్నారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు వేదాశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

-న్యూస్‌టుడే, బృందం


సహస్ర లింగేశ్వరస్వామి దేవాలయంలో పార్వతీ దేవికి కుంకమ పూజల


కొల్లిపర ముక్తేశ్వరస్వామి ఆలయంలో గాయత్రీమాతగా


అత్తోటలో త్రిపురాసుందరిగా


చేబ్రోలు: గాయత్రీ దేవిగా పార్వతీ అమ్మవారు


దుర్గాదేవి దేవాలయంలో కుంకుమ పూజలో మహిళలు


విద్యుద్దీపాలంకరణలో పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానం


తెనాలి గంగానమ్మపేట: కుంకుమ పూజ చేస్తున్న మహిళలు


బోసురోడ్డులోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో రూ.15 లక్షలతో..

ఏఎన్‌యూ మహిళా ఆచార్యులకు అరుదైన గౌరవం

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న మహిళా ఆచార్యులకు అరుదైన పురస్కారాలు లభించాయి. సూక్ష్మ జీవ, వృక్షశాస్త్రంలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న అమృతవల్లికి అంతర్జాతీయ పురస్కారం, సోషల్‌వర్క్, సోషియాలజీ విభాగంలో పనిచేస్తున్న ఆచార్య సరస్వతి రాజ్ అయ్యర్‌ను అమెరికాలోని లైఫ్ బోట్ ఫౌండేషన్ సలహామండలి సభ్యురాలిగా నియమించారు.

★ తైవాన్‌లోని వరల్డ్ వెజిటబుల్ సెంటర్‌లో గతనెల 25 నుంచి 27వ రకు జరిగిన 8వ పీజీపీఆర్ అంతర్జాతీయ సదస్సులో అమృతవల్లి పరిశోధన పత్రాన్ని సమర్పించారు. డాక్టర్ అమృతవల్లి పరిశోధన పత్రానికి ఔట్ స్టాండింగ్ ఉమెన్ పీజీపీఆర్ రీసెర్చర్ అవార్డును ప్రకటించారు.


ఆచార్య అమృతవల్లి, ఆచార్య సరస్వతిరాజ్ అయ్యర్‌లను అభినందిస్తున్న వీసీ ఆచార్య గంగాధర్

80 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి బుర్రిపాలెం రోడ్డులోని షెడ్డులో రేషన్ బియ్యపు నిల్వలు ఉన్నాయన్న సమాచారం మేరకు గ్రామీణ పోలీసులు శుక్రవారం అక్కడకు వెళ్లి గుర్తించారు. షెడ్డుకు తాళం వేసి ఉండటంతో తహసీల్దార్ గోపాలకృష్ణ దృష్టికి పోలీసులు తీసుకెళ్లడంతో ఆయన వచ్చి షెడ్డు యజమానితో తాళం తీయించారు. మొత్తం 80 బస్తాలు (ఒక్కో బస్తా 50 కేజీలు) రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించి సీజ్ చేసి కేసు నమోదు చేశారు. షెడ్డు అద్దెకు తీసుకున్న వారు, రేషన్ బియ్యం అక్కడ నిల్వ ఉంచిన వారి వివరాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. ఈ కేసు విషయంలో చూసీచూడనట్లు పోవాలని అధికారులపై ఒత్తిళ్లు వచ్చినట్లు తెలిసింది. ప్రభుత్వం, ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉండటంతో స్థానిక అధికారులు, పోలీసులు వాటిని పరిగణనలోకి తీసుకోకుండా కేసు నమోదు చేశారు.


బియ్యం బస్తాలు పరిశీలిస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

ఆత్మ విశ్వాసం మానసిక ఆరోగ్యానికి తొలి మెట్టు

పొన్నూరు, న్యూస్‌టుడే: మన ఆత్మ విశ్వాసం మానసిక ఆరోగ్యానికి తొలి మెట్టు అని విజ్ఞాన్ యూనివర్సిటీ ఉపకులపతి పి.నాగభూషణ్ వెల్లడించారు. శుక్రవారం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో వరల్డ్ మెంటల్ హెల్త్ డే సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మానసిక సమస్యలు ఎదురయ్యినప్పుడు స్నేహితులు లేదా కుటుంబసభ్యులతో మాట్లాడటం, నిపుణుల సలహా తీసుకోవడం చాలా ముఖ్యమన్నారు. అనంతరం అధ్యాపకులతో కలిసి ఉపకులపతి గోడ పత్రికను అవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యా సంస్థల వైస్ ఛైర్మన్ లావు కృష్ణదేవరాయలు, రిజిస్ట్రార్ ఎంఎస్.రఘునాథన్ పాల్గొన్నారు.


విద్యార్థులతో లావు కృష్ణదేవరాయలు, ఉపకులపతి పి.నాగభూషణ్

నేడు ఎన్‌వీఆర్ స్మారక పురస్కారాల ప్రదానోత్సవం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య సమర యోధుడు, మాజీ ఎమ్మెల్యే నన్నపనేని వెంకట్రావు స్మారక పురస్కారాల ప్రదానోత్సవం సభ శనివారం నిర్వహించనున్నట్లు ఎన్‌వీఆర్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు నన్నపనేని సుధాకర్, కార్యదర్శి మారౌతు సీతారామయ్య తెలిపారు. స్థానిక ఎన్‌వీఆర్ కల్యాణ మండపంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నన్నపనేని వెంకట్రావు ఆలోచనలు, ఆశయాలకు అనుగుణంగా సాగుతున్న వారికి పురస్కారాలు అందించామని, గతంలో యడ్లపాటి వెంకట్రావు, పూసపాటి అశోక్ గజపతిరాజు, కె.విశ్వనాథ్, కొణిజేటి రోశయ్య ఈ పురస్కారాలు అందుకున్నారని తెలిపారు. ఈ ఏడాది పేదల వైద్యులు, సాహిత్యాభిలాషి డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, అన్నమయ్య గ్రంథాలయం గుంటూరు వ్యవస్థాపకులు లంకా సూర్యనారాయణలకు ఎన్‌వీఆర్ పురస్కారాలు అందించనున్నట్లు వివరించారు. స్థానిక ఎన్‌వీఆర్ కల్యాణ మండపంలో సాయంత్రం 6 గంటలకు వేడుక ఉంటుందని, కేంద్ర, రాష్ట్ర మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, నాదెండ్ల మనోహర్‌లతో పాటు మాజీ మంత్రులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, నన్నపనేని రాజకుమారి, నక్కా ఆనందబాబు తదితరులు విశిష్ట అతిథులుగా హాజరౌతున్నారని పేర్కొన్నారు. సమావేశంలో రాజేశ్వరి, భాస్కర్ పాల్గొన్నారు.


వివరాలు తెలియచేస్తున్న నన్నపనేని సుధాకర్, పక్కన సీతారామయ్య

గంగానమ్మపేటలో గొడవ

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో గంగానమ్మపేటకు చెందిన కొంత మంది ఘర్షణ పడి ఇచ్చిన ఫిర్యాదులపై రెండు కేసులు నమోదు చేసినట్లు రెండో పట్టణ పోలీసులు శుక్రవారం తెలిపారు.

వాహనం ఢీ కొని ఒకరి మృతి

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: గుర్తు తెలియని వాహనం ఢీ కొని పట్టణ మారీసుపేటకు చెందిన శివశంకర్ (50) మృతి చెందిన ఘటన తెనాలి-గుంటూరు వంతెన వద్ద శుక్రవారం రాత్రి జరిగింది. ఢీ కొట్టిన వాహనదారు వేగంగా అక్కడి నుంచి వాహనంతో సహా వెళ్లిపోయాడు. మృతదేహాన్ని వైద్యశాలకు తరలించిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

క్రేన్ ఢీ కొని వృద్ధురాలికి తీవ్ర గాయాలు

తెనాలి టౌన్: రోడ్డుపై నడిచి వెళుతున్న పట్టణ సుల్తానాబాద్‌కు చెందిన 80 సంవత్సరాల ధనావత్ హేమలీబాయిని క్రేన్ ఢీ కొట్టటంతో తీవ్రంగా గాయపడిన ఘటన పట్టణ చెంచుపేటలో శుక్రవారం జరిగింది. మందులు కొందామని రోడ్డుపై నడిచి వెళుతున్న వృద్ధురాలిని క్రేన్ ముందరి భాగం ఢీ కొట్టింది. ఆమెను గుంటూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు పంపారు.

తెనాలిలో చోరీలు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: పట్టణ చినరావూరు మార్గంలో గురువారం అర్ధరాత్రి తర్వాత రెండు చోరీలు జరిగాయి. ద్విచక్ర వాహనాల షోరూంలోకి ప్రవేశించిన దుండగులు రూ.25 వేల నగదు, ఒక చరవాణి చోరీ చేశారు. ఈ దుకాణం వెనుక పాల వ్యాపారం చేసే వ్యక్తి ఇంట్లోకి కూడా వెళ్లి రూ.80 వేల నగదు, నాలుగు గ్రాముల బంగారు బిస్కెట్ తస్కరించారు. రెండు చోట్ల కూడా వెనుక తలుపుల నుంచి దుండగులు ప్రవేశించారు. సీసీ కెమెరాల్లో చోరీ ఘటన నమోదు అయిందని తెలిసింది. వన్‌టౌన్ పోలీసులు కేసులు దర్యాప్తు చేస్తున్నారు.


సినీనటుల మనోభావాలు దెబ్బతీస్తే సహించం

తెనాలి (కొత్తపేట), సినీనటుల మనోభావాలు దెబ్బతీసేలా ఎవరు మాట్లాడినా సహించమని మా ఏపీ వ్యవస్థాపకుడు దిలీప్‌రాజా పేర్కొన్నారు. ఆయన శుక్రవారం తెనాలిలో మాట్లాడారు. సినీనటుల వ్యక్తిగత జీవితాలను లక్ష్యంగా చేసుకుని మాట్లాడటం అమానవీయమన్నారు.

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

సమస్యలు వింటూ.. భరోసా కల్పిస్తూ..



మంత్రి నారా లోకేశ్‌కు సమస్య వివరిస్తున్న బాధితులు

తాడేపల్లి, న్యూస్‌టుడే : ప్రజలు చెప్పే సమస్యలు వింటూ వాటి పరిష్కారానికి మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. ఉండవల్లిలో శుక్రవారం నిర్వహించిన 'ప్రజాదర్బార్‌'లో ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వచ్చిన వారందరికీ సమస్య పరిష్కరిస్తానంటూ హామీ ఇవ్వడంతో బాధితులంతా ఆనందంతో తిరిగి వెళ్తున్నారు. పది వరకు చదువుకున్న తమ కుమారుడికి ఉద్యోగం ఇప్పించి ఉపాధి కల్పించాలని తాడేపల్లికి చెందిన ఆరోగ్యరావు మంత్రి లోకేశ్‌కి విన్నవించారు. అనారోగ్యంతో బాధపడుతున్న తనకు ఆర్థికసాయం అందించాలని తాడేపల్లి బ్రహ్మానందపురానికి చెందిన ఆగ్నేష కోరారు. భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్న తాను ఇటీవల ప్రమావదశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడ్డానని వైద్య కోసం ఆర్థికసాయం అందించాలని నూతక్కికి చెందిన కోటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. జీవనోపాధితో పాటు పిల్లల చదువులకు సాయం అందించాలని కోరారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తనకు శరీరంలోని ఎడమ భాగం పని చేయడం లేదు. దివ్యాంగ పింఛను మంజూరు చేయించాలని మంగళగిరి 14వ వార్డుకు చెందిన బిట్రా హేమకిషన్ కోరారు. అందరి సమస్యలు తెలుసుకున్న మంత్రి నారా లోకేశ్ వాటి పరిష్కరిస్తారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

అభినందనలు



శ్యాప్ ఛైర్మన్ రవి నాయుడును సత్కరిస్తున్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే : ఏపీ లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, క్రీడాప్రాధికార సంస్థ ఛైర్మన్లుగా శుక్రవారం తమ కార్యాలయాల్లో బాధ్యతలు స్వీకరించిన పిల్లి మాణిక్యరావు, అనిమిని రవి నాయుడును ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు శుక్రవారం కలిశారు. పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

పాడి రైతులకు పశుకిసాన్ క్రెడిట్ కార్డులు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే



పశు పోషకులను ప్రోత్సహించి వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమను వృద్ధిలోకి తెచ్చేందుకు కూటమి ప్రభుత్వం పశుకిసాన్ క్రెడిట్ కార్డులను జారీ చేయాలని కీలక నిర్ణయం తీసుకుంది. పశువులకు దాణా, మేత కొనాలంటే రైతులు నగదు లేక తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంది. వ్యవసాయంలో పంటల సాగుకు అప్పులు చేసి పెట్టుబడి పెట్టిన అన్నదాతలకు చేతిలో డబ్బులు లేక పశువులకు తగిన దాణా అందించలేక గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఇలాంటి వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం ఈ కార్డులను అందుబాటులోకి తెచ్చింది. ప్రత్తిపాడు నియోజకవర్గంలో పశువైద్యులు, పశుసంవర్ధక శాఖ గ్రామ సహాయకులు అర్హత కలిగిన పాడి రైతుల నుంచి ఆధార్, బ్యాంకు ఖాతా నకలు తీసుకుని దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. బ్యాంకర్లతో సమన్వయం చేసుకుని అర్హులైన వారికి కార్డులను అందించనున్నారు.

లక్ష్యాలు ఇలా ఉన్నాయి...

మండలం	లక్ష్యం
ప్రత్తిపాడు	459
గ్రామీణ గుంటూరు	283
పెదనందిపాడు	422
కాకుమాను	625
వట్టిచెరుకూరు	280
మొత్తం	2,069

ప్రయోజనాలేంటంటే?

సాధారణ క్రెడిట్‌కార్డు మాదిరిగానే వినియోగించుకోవచ్చు. ఆన్‌లైను ద్వారా చెల్లింపులు చేయవచ్చు. డబ్బులు అవసరమైనప్పుడు నగదు తీసుకుని వాడుకోవచ్చు. సకాలంలో పాడి పశువుల పోషణకు ఈ నగదు ఉపయోగపడతాయి. తీసుకున్న సొమ్మును 40 రోజుల్లోగా తిరిగి చెల్లిస్తే ఎలాంటి వడ్డీ ఉండదు. తర్వాత చెల్లిస్తే 7 శాతం వడ్డీ వసూలు చేస్తారు. ఇందులో 3 శాతం సొమ్మును ప్రభుత్వం రాయితీగా ఇస్తుంది. కార్డును సక్రమంగా వినియోగిస్తే ఎలాంటి వడ్డీ భారం లేకుండానే ఆర్థిక అవసరాలు తీర్చుకోవచ్చు. ఆర్థిక క్రమశిక్షణ పాటించడం ద్వారా ఈ కార్డులను సద్వినియోగం చేసుకుంటే అదనంగా పశువులను కూడా కొనుగోలు చేసుకోవచ్చు.

ఒక్కో గేదెకు రూ.30వేల రుణం

పశు పోషకులు దరఖాస్తు చేసుకోవచ్చు

పాడి రైతులు పశు కిసాన్ క్రెడిట్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఒక గేదె ఉన్న రైతుకు రూ.30 వేలు చొప్పున గరిష్ఠంగా 5 గేదెల వరకు అర్హత ఆధారంగా ఈ కార్డులను మంజూరు చేస్తాం. స్వీకరించిన దరఖాస్తులను ఉన్నతాధికారులకు, బ్యాంకు అధికారులకు పంపిస్తున్నాం.

-నందకిశోర్, పశు వైద్యుడు, గొట్టిపాడు



అన్నదాతలతో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు గోపాలస్వామి, వెంకటలక్ష్మి

రైతులకు అప్రమత్తత అవసరం

పెదనందిపాడు: రైతులు అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు పైర్లను సంరక్షించుకోవాలని లాం ఫాం శాస్త్రవేత్తలు గోపాలస్వామి, వెంకటలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని రావిపాడులో పత్తి, మిరప, మినుము పైర్లను వారు శుక్రవారం పరిశీలించారు. రైతులకు పలు సూచనలు ఇచ్చారు. ఏవో సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

ఉప సర్పంచి పదవికి రాజీనామా

మేడికొండూరు: మేడికొండూరు ఉప సర్పంచి పదవికి పాములపాటి అనూష రాజీనామా శుక్రవారం చేశారు. గత పంచాయతీ ఎన్నికల్లో ఆమె ఒకటో వార్డు సభ్యురాలిగా తెదేపా తరఫున గెలిచారు. వ్యక్తి గత కారణాలతోనే తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రాజీనామా పత్రం అందించగా ఎంపీడీవో చందన ఆమోదించారు. ప్రస్తుతం అనూష వార్డు సభ్యురాలిగా కొనసాగనున్నారు.

మీ ఆధ్వర్యంలోనే చక్కదిద్దండి

అన్నక్యాంటీన్ల పర్యవేక్షణ అధికారిగా హేమామాలినీ రెడ్డి

మంగళగిరి, న్యూస్‌టుడే : మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న అన్నక్యాంటీన్ల పర్యవేక్షణ అధికారిగా గతంలో నగరపాలక అడిషినల్ కమిషనర్‌గా పని చేసిన హేమామాలినీ రెడ్డి నియమితులయ్యారు. మంగళగిరి బస్‌స్టాండ్ కూడలిలో గతంలో మంత్రి నారా లోకేశ్ సొంత ఖర్చులతో టెంట్ వేసి అన్నక్యాంటీన్ నిర్వహించారు. అప్పటి ఎమ్మెల్యే ఆర్కే ప్రోద్బలంతో ఆమె దాన్ని తొలగిస్తున్నారనే విషయం తెలుసుకున్న తెదేపా నాయకులు, కార్యకర్తలు అడ్డుకున్నారు. దీనిపై అప్పట్లో కార్యకర్తలపై కేసులు బనాయించి ఇబ్బందులకు కూడా గురి చేశారు. నగరంలో తెదేపా ఫ్లెక్సీలు, జెండాలు కానీ ఏర్పాటు చేయకుండా అడ్డుకున్నారు. ఈ పరిస్థితుల్లో కార్యకర్తలు, నాయకులు ఆమె తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తర్వాత ఎన్నికల ముందు ఆమెను వేరే మున్సిపాల్టీకి బదిలీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్నక్యాంటీన్ పర్యవేక్షణ కోసం ఆమెను నియమించారు.



జనసేన కార్యాలయం వద్ద ఆప్కాస్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నిరసన

వేతనాలు ఇప్పించండి మహాప్రభో

మంగళగిరి, న్యూస్‌టుడే : తమ సమస్యలకు పరిష్కారం కోరుతూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను కలిసి వినతిపత్రం అందజేసేందుకు ఆంధ్రప్రదేశ్ ఆప్కాస్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు రాష్ట్ర నలుమూలల నుంచి శుక్రవారం స్థానిక జనసేన రాష్ట్ర కార్యాలయం వద్దకు వచ్చారు. కానీ డిప్యూటీ సీఎం అందుబాటులో లేకపోవడంతో ఆయన వస్తారని ఉదయం నుంచి రాత్రి వరకు ఎదురు చూశారు. ఈ క్రమంలో గంటలు గడిచినా తమకు న్యాయం చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదని వాపోయారు. రాష్ట్రంలో వైద్య ఆరోగ్య శాఖలో డీఎంఈ, డీసీహెచ్ఎస్, డీఎంహెచ్‌వో పరిధిలో పని చేస్తున్న తమకు 15 నుంచి 20 నెలలు వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. దయచేసి మా జీతాలు మాకు ఇప్పించండీ మహాప్రభో... అంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. తమ సమస్య పరిష్కారమయ్యే వరకు వెళ్లేది లేదని జనసేన కార్యాలయం వద్దనే ఉన్నారు.

అసైన్డ్ రైతులకు కౌలు చెల్లించాలి

తుళ్లూరు, న్యూస్‌టుడే : రాజధాని గ్రామాల్లోని అసైన్డ్ రైతులకు కౌలు చెల్లింపులు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం తుళ్లూరు సీఆర్డీఏ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. ఈ మేరకు సీఆర్డీఏ అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్‌కు వినతిపత్రం అందించారు. మూడేళ్లుగా బకాయి ఉన్న అసైన్డ్ రైతుల కౌలును వెంటనే చెల్లించాలని నినాదాలు చేశారు. నాయకులు ఎం.రవి, భాగ్యరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రాజధానిలో అసైన్డ్ రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని త్వరలో కౌలు చెల్లింపులు చేస్తామని సీఆర్డీఏ అదనపు కమిషనర్ వారికి తెలిపారు. చిలకా బసవయ్య, షేక్ జానీ, కె.వెంకటేశ్వర్లు, మేరిగ దాసు, నేలపాటి పాపమ్మ, బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న అసైన్డ్ రైతులు



నమూనాలు పరిశీలిస్తున్న సీడ్ ఏపీ ఛైర్మన్ దీపక్‌రెడ్డి

కేఎల్‌యూలో ప్రారంభమైన సమ్యక్- 2024

తాడేపల్లి, న్యూస్‌టుడే : కేఎల్ విశ్వవిద్యాలయంలో రెండ్రోజుల పాటు జరిగే జాతీయస్థాయి టెక్నో మేనేజ్‌మెంట్ టెస్ట్ శుక్రవారం ప్రారంభమైంది. దీనికి సీడ్ ఏపీ ఛైర్మన్ దీపక్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు నమూనాలను పరిశీలించారు. వీసీ డాక్టర్ పార్థసారథివర్మ, వైస్ ఛాన్స్‌లర్లు డాక్టర్ రాజశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ డేకు తరలివచ్చిన రైతులు

తుళ్లూరు: తుళ్లూరు సీఆర్డీఏ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పలు గ్రామాల నుంచి రైతులు తరలివచ్చి అర్జీలు సమర్పించారు. సీఆర్డీఏ అదనపు కమిషనర్ జి.సాయిసూర్య ప్రవీణ్ చంద్ అన్నదాతల సమస్యలను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధికి సంబంధించి- 7, ల్యాండ్ పూలింగ్, రిజిస్ట్రేషన్లు- 71, ప్రణాళిక విభాగం- 3, సామాజిక అభివృద్ధి- 6 మొత్తం 83 దరఖాస్తులు వచ్చాయి.

ఉచిత ఇసుక విధానం అమలు చేయండి



తుళ్లూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం నాయకుల ఆందోళన



మంగళగిరిలో..

పెదనందిపాడు, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం సామాన్యులకు ఇసుకను అందుబాటులోకి తెచ్చి ఉచితంగా ఇవ్వాలని సీపీఎం నాయకులు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. నాయకులు రమేష్, వెంకటశివరావు, యానాదులు, రాజేంద్ర, భువనేశ్వరి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మేడికొండూరు, ఫిరంగిపురం గ్రామీణం: సీపీఎం ఆధ్వర్యంలో మేడికొండూరు, ఫిరంగిపురం, పొనుగుపాడులో ఆందోళన వ్యక్తం చేశారు. రామకృష్ణ, సాధిక్, మస్తాన్‌వలి, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

తుళ్లూరు: ఉచిత ఇసుక హామీని ప్రభుత్వం పారదర్శకంగా అమలు చేయాలని కోరుతూ సీపీఎం నాయకులు తుళ్లూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. తహసీల్దార్ సుజాతకు వినతిపత్రం అందించారు.

దుగ్గిరాల: పేద, మధ్య తరగతి ప్రజలందరికీ ఇసుక అందుబాటులోకి తీసుకురావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఈమని అప్పారావు కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

మంగళగిరి, న్యూస్‌టుడే : స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట జరిగిన కార్యక్రమంలో బాలకృష్ణ, కమలాకర్, జవహర్‌లాల్, కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి: భవన నిర్మాణ కార్మికులకు పని కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు కోరారు. తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన నిరసనలో పలువురు నాయకులు పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్‌కి వినతిపత్రం అందజేశారు.

ప్రమాదమని తెలిసినా పట్టించుకోరే...?



గుండిమెడ- మెల్లెంపూడి మధ్య స్తంభాలకు అలుకున్న పిచ్చిమొక్కలు

న్యూస్‌టుడే, తాడేపల్లి

ప్రమాదం జరిగాక పరుగులు తీసేకంటే ముందుగానే గుర్తించి సరిచేస్తే ప్రజలకు ప్రాణాపాయం తప్పుతుంది. మంగళగిరి విద్యుత్తు సబ్ డివిజన్ పరిధిలోని రాజధాని ప్రాంతమైన తాడేపల్లి పరిసరాల్లో విద్యుత్తు స్తంభాలు ప్రమాదభరితంగా ఉన్నాయి. వాటిని సంబంధిత అధికారులు ముందుగానే సరి చేస్తే ప్రమాదాలు నివారించవచ్చు. నులకపేట- ఉండవల్లి మధ్య విద్యుత్తు స్తంభాలు ఒరిగిపోయాయి. బ్రహ్మానందపురం నుంచి ఉండవల్లిలోని విద్యుత్తు ఉపకేంద్రానికి వెళ్లే ప్రధాన లైను కావడంతో అప్రమత్తతంగా ఉండాలి. మెల్లెంపూడి వద్ద ఓ కరెంట్ స్తంభం తీగలపై ఆధారపడి ఉంది. దీంతో పంట పొలంలో పని చేసుకోవాలంటే భయంగా ఉందంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. గుండిమెడ- మెల్లెంపూడి మధ్య ప్రధాన రహదారి పక్కన విద్యుత్తు స్తంభాలకు పిచ్చిమొక్కలు అల్లుకుని ఉన్నాయి. ఈ నేపథ్యంలో వర్షాలు కురిస్తే సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయా ప్రాంతవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు వీటిపై దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.



స్తంభాలు ఒరిగిపోయి ఇలా...

శక్తి స్వరూపిణి.. జగద్రక్షిణి

మంగళగిరి, తాడికొండ, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో దసరా నవరాత్రి ఉత్సవాలు కనుల పండువగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. భక్తులకు వివిధ రూపాల్లో జగన్మాత దర్శనమిస్తున్నారు. ఆలయాలు విద్యుత్తు వెలుగులతో కొత్త శోభ సంతరించుకున్నాయి. పలుచోట్ల నెలకొల్పిన విగ్రహాలు కనువిందు చేస్తున్నాయి. –న్యూస్‌టుడే, బృందం



దుగ్గిరాల శివాలయంలో..



పెదనందిపాడులో...



మంగళగిరి : నృసింహుని ఆలయంలో..



లాలుపురంలో..



ప్రత్తిపాడులో..



వట్టిచెరుకూరు: పుల్లడిగుంటలో...



తాడికొండ పడమటి వీధిలో..

తిరుమల అన్నదానానికి కూరగాయల విరాళం

తాడేపల్లి, న్యూస్‌టుడే : తితిదేలో జరిగే అన్నదానానికి తాడేపల్లిలోని రివర్‌బ్రీజ్ అపార్టుమెంట్ నివాసితులు పది టన్నుల కూరగాయలను అందించారు. భాజపా అధికార ప్రతినిధి పాతూరి నాగభూషణం దీనికి ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి లారీని తిరుమలకు పంపించారు. పలువురు అపార్టుమెంటు వాసులు పాల్గొన్నారు.

తుళ్లూరు డీఎస్పీగా టి.మురళీకృష్ణ

తుళ్లూరు, న్యూస్‌టుడే : సాధారణ బదిలీల్లో భాగంగా తుళ్లూరు డీఎస్పీగా టి.మురళీకృష్ణ శుక్రవారం నియామకమయ్యారు. ఆయన ప్రస్తుతం బాపట్ల జిల్లా రేపల్లె డీఎస్పీగా పని చేస్తున్నారు. ఇప్పటి వరకు గుంటూరు ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీగా పని చేస్తున్న మల్లికార్జునరావు తుళ్లూరు ఇన్‌ఛార్జి డీఎస్పీగా అదనపు బాధ్యతలు నిర్వహించారు.

చలపతికి జాతీయ స్థాయి అవార్డు

తాడికొండ, న్యూస్‌టుడే : లాం చలపతి ఇంజినీరింగ్ కళాశాలకు జాతీయ స్థాయిలో అవార్డులు వరించాయని కళాశాల ప్రిన్సిపల్ ఎం.చంద్రశేఖర్ శుక్రవారం తెలిపారు. ఏఐసీటీఈ, ఎడ్యుస్కిల్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో న్యూ దిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఏఐసీటీఈ ఛైర్మన్ సీతారాం, సౌత్ ఏషియన్ యూనివర్సిటీ ప్రెసిడెంట్ క్రిషన్ అగర్వాల్ చేతుల మీదుగా ప్రిన్సిపల్ చంద్రశేఖర్ ఈ అవార్డులు అందుకున్నారు. లాం చలపతి కళాశాల ఇంజినీరింగ్ కళాశాలల విభాగంలో 8వ ర్యాంకు కైవసం చేసుకున్నట్లు తెలిపారు.

బాధ్యతల స్వీకరణ

ఫిరంగిపురం గ్రామీణం, న్యూస్‌టుడే : ఫిరంగిపురం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా కిశోర్‌బాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన అమీనాబాద్ కార్యదర్శిగా పని చేస్తూ బదిలీపై ఫిరంగిపురం వచ్చారు.

దుగ్గిరాల: దుగ్గిరాల ఎంపీడీవోగా అడిగొప్పుల శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పొన్నూరు నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఆయనతో పాటు ఈవోపీఆర్డీగా జవహర్‌లాల్ నెహ్రూ, డ్వాక్రా ఏపీఎంగా సురేష్ కుమార్, పంచాయతీరాజ్ ఏఈగా తోట గోవర్థన్‌రావు, సూపరింటెండెంట్‌గా చంద్రమోహన్, హౌసింగ్ ఏఈగా సుబ్బారావులు కూడా విధుల్లో చేరారు. వీరు కాక పలువురు పంచాయతీ కార్యదర్శులూ మారారు.

వట్టిచెరుకూరు: వట్టిచెరుకూరు ఎంపీడీవోగా ఎం.రమేష్‌బాబు బాధ్యతలు స్వీకరించారు. ఆయన కృష్ణాజిల్లా జగ్గయ్యపేట నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు.

మేడికొండూరు: మేడికొండూరు ఈవోపీఆర్డీగా పూర్ణ శంకరావు బాధ్యతలు స్వీకరించారు. గతంలో పని చేసిన రవికుమార్ తాడేపల్లికి బదిలీ అయ్యారు.

తుళ్లూరు: తుళ్లూరు ఎంపీడీవోగా కానూరి శిల్ప బాధ్యతలు స్వీకరించారు. ఎన్టీఆర్ జిల్లా కంచికచర్లలో విధులు నిర్వహిస్తూ బదిలీపై ఆమె ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న బి.శివన్నారాయణ బాపట్ల జిల్లా వేమూరుకు బదిలీపై వెళ్లారు.

దస్తావేజులు పోయినవి

గుంటూరు జిల్లా, తాడికొండ (మం), తాడికొండ (గ్రామం), డోరు నెం: 9-4రు నివాసి బొళ్ళ క్రిష్టారెడ్డి గారి కుమారుడు బొళ్ళ శ్రీనువాసరెడ్డి (9866005813) నాపేరిట తాడికొండ గ్రామం తాలుకు డి.నెం: 140/ఎరుగల య.1-00 శెంట్లు భూమి. తాడికొండ సబ్ రిజిష్ట్రారు వారి కార్యాలయంలో డాక్యుమెంట్ నెం: 282/2010రుగా నా పేరిట రిజిష్టరు కాబడినది. సదరు దస్తావేజును తీసుకొని బైకుపై మా ఇంటి నుండి దగ్గర నుండి తాడికొండ MRO ఆఫీసులకు వెళుతుండగా దారి మధ్యలో పోయినది. ఎవరికైన దొరికినచో పై నెంబర్‌కు తెలియజేయగలరు.

సిబ్బందికి వివరాల్విండి

దుగ్గిరాల, న్యూస్‌టుడే : స్కిల్ సెన్సెస్ కోసం ఇంటింటికీ వచ్చే సిబ్బంది ఇక్కడి ఉద్యోగులేనని ప్రజలు వారికి వివరాలన్నీ ఇవ్వడంతో ఆ సమయంలో ఫోన్‌కు వచ్చే ఓటీపీని వారికి చెప్పవచ్చని ఎంపీడీవో అడిగొప్పుల శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అందరూ దీక్షతో పూర్తి చేయాలన్నారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ మేనేజర్‌తో పాటు ఈవోపీఆర్డీ జవహర్‌లాల్ నెహ్రూ, సూపరింటెండెంట్ చంద్రమోహన్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ఐదు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

దుగ్గిరాల: పెదకొండూరు, గొడవర్రు నుంచి ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న ఐదు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై వెంకట రవి శుక్రవారం తెలిపారు. వీటిని మైనింగ్ శాఖకు అప్పగించనున్నామని చెప్పారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే : పురుగు మందు తాగిన ఓ వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు... తుళ్లూరు మండలం ఐనవోలుకు చెందిన శివపార్వతి(50)కు, ప్రత్తిపాడుకు చెందిన బిళ్లా వెంకటేశ్వర్లుతో 30 ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. శివపార్వతి ఐదేళ్ల నుంచి మానసిక వ్యాధితో బాధపడుతూ గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతుంది. సెప్టెంబరు 30న మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి సాయంత్రం వచ్చింది. తన కుమారుడితో పురుగుల మందు తాగినట్లు చెప్పి, కాసేపటికి తాగలేదని చెప్పడంతో మానసిక పరిస్థితి బాగోలేక అలా చెబుతుందేమోనని వైద్యశాలకు తీసుకెళ్లలేదు. ఈ క్రమంలో ఈ నెల ఒకటో తేదీన శివపార్వతి ఆరోగ్యంలో మార్పులు రావడంతో కుటుంబ సభ్యులు ప్రత్తిపాడు ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స చేయించి మెరుగైన చికిత్స కోసం గుంటూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు భర్త వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ప్రత్తిపాడు ఎస్సై కె.నాగేంద్ర తెలిపారు.

బాధితుడి ఫిర్యాదు.. కేసు నమోదు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ప్రత్తిపాడుకు చెందిన బొబ్బూరి లింగయ్య ఈనెల ఒకటో తేదీన తన ద్విచక్ర వాహనంపై తన మనవరాలిని స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో వదిలిపెట్టాడు. తిరిగి వస్తుండగా పెదనందిపాడు వైపు నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న ఓ వ్యక్తి అతివేగంతో వచ్చి లింగయ్య వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో లింగయ్య రోడ్డుపై పడి గాయాలయ్యాయి. ప్రత్తిపాడులో ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ లింగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగేంద్ర చెప్పారు.

యువతి అదృశ్యంపై...

వట్టిచెరుకూరు: మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి(21) అదృశ్యమైనట్లు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. హెడ్ కానిస్టేబుల్ రాజశేఖర్ వివరాల మేరకు.. యువతి ఈ నెల 2న అర్ధరాత్రి సమయంలో ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఆమె కోసం వెతికిన ఫలితం లేకపోయిందని తండ్రి కృపారావు శుక్రవారం స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో చోదకుడికి తీవ్రగాయాలు

ఫిరంగిపురం గ్రామీణం, న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహన చోదకుడికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు ప్రత్తిపాడు మండలం యనమదలకు చెందిన సింగయ్య తమ బంధువు అంత్యక్రియలలో పాల్గొనేందుకు ఫిరంగిపురం వెళ్లాడు. తిరిగి వస్తుండగా వేములూరిపాడు వద్దకు చేరుకునేసరికి ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో కింద పడ్డాడు. దీంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. ఆ సమయంలో అక్కడే ఉన్న స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ రామారావు, స్థానిక పోలీసులు క్షతగాత్రుడ్ని చికిత్స నిమిత్తం 108లో గుంటూరు సర్వజనాసుపత్రి తరలించారు.

గుంటూరు తూర్పు

నేడు ఎన్‌టీఏ రాష్ట్ర కార్యవర్గం సమావేశం

నగరపాలక సంస్థ (గుంటూరు): నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) రాష్ట్ర ప్రథమ కార్యవర్గ సమావేశం శనివారం ఉదయం 10 గంటలకు గుంటూరులోని ఏపీ ఎన్జీవో హాల్లో జరుగుతుందని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.హైమారావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు నడిపినేని వెంకట్రావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ఎమ్మెల్సీ పి.అశోక్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఏఎస్.రామకృష్ణ, ఎన్‌టీఏ రాష్ట్ర ప్రముఖులు సంఘం చైర్మన్ సుభాష్ చంద్రబోస్ పాల్గొంటారన్నారు. సభలో విద్యావ్యవస్థ బలోపేతం, ఉపాధ్యాయ సమస్యలపై చర్చించి తీర్మానాలు చేసి ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు తెలిపారు.

49,880 మిర్చి బస్తాల విక్రయం

మిర్చియార్డు, న్యూస్‌టుడే: మిర్చియార్డులో 49,880 బస్తాలు విక్రయాలు జరిగాయి. రైతులు శుక్రవారం 42,191 బస్తాలు యార్డుకు తరలించారు. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో 19,029 బస్తాలు నిల్వ ఉన్నాయి. నాన్ ఏసీ కామన్ వెరైటీ మిర్చి రకాల సగటు ధర రూ.8,500-16,500, నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ మిర్చి రకాల సగటు ధర రూ.8,000-18,800, తాలు మిర్చికి రూ.5,000-12,000 ధర లభించింది. ఏసీ కామన్ వెరైటీ మిర్చి రకాల సగటు ధర రూ.9,500-16,000, ఏసీ స్పెషల్ వెరైటీ మిర్చి రకాల సగటు ధర రూ.8,000-18,600, తాలు మిర్చికి రూ.5,500-11,500 ధర లభించింది.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
94406 38515, 80085 73097

నెహ్రూనగర్, న్యూస్‌టుడే

? ఇందిరాకాలనీ 4వ వీధి, సంగడిగుంట మదర్‌థెరెసా విగ్రహం వద్ద ఖాళీ స్థలంలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. అటుగా పాములు తిరుగుతుండటంతో భయంగా ఉంది. -శ్రీధర్

✔ సిబ్బందిని పంపించి సమస్య పరిష్కరిస్తాం.
-బాబర్, ఎలక్ట్రికల్ ఏఈ, నగరపాలక సంస్థ

స్పందనకు వందనం

తొలగిన వ్యర్థాలు

పండ్ల మార్కెట్‌లో వ్యాపారులు పడేసిన అరటిగెలల వ్యర్థాల్ని కార్పొరేషన్ సిబ్బంది తొలగించిన వైనంపై గత నెల 29న 'ఈనాడు'లో 'ఆ వ్యర్థాలు.. అనర్థాలు' శీర్షిక ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శుక్రవారం వాటిని తొలగించి బ్లీచింగ్ చల్లారు. ఇక నుంచి పండ్ల మార్కెట్‌లో వ్యర్థాల్ని ఎప్పటికప్పుడు తొలగిస్తామని తెలిపారు. - పట్నంబజారు, న్యూస్‌టుడే



మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: యువత మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం రాత్రి అరండల్‌పేట పోలీసుస్టేషన్ పరిధిలోని వెంగళరావునగర్‌లో వారధి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజలు సైబర్ నేరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. యువత పోలీసు కేసుల్లో ఉంటే ఉన్నత చదువులకు ఆటంకం ఏర్పడి మంచి భవిష్యత్తును కోల్పోవాల్సి ఉంటుందన్నారు. తల్లిదండ్రులకు తమ పిల్లలు ఏం చేస్తున్నారో గమనించాల్సిన బాధ్యత ఉన్నదని చెప్పారు. కార్యక్రమంలో డీఎస్పీ జయరాంప్రసాద్, సీఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు

పట్నంబజారు, న్యూస్‌టుడే: ఇసుక అక్రమంగా తరలించే వారిపై చర్యలు తీసుకోనున్నట్లు తూర్పు విభాగం తహసీల్దారు నాగేష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3న అమరావతి రోడ్డు, గోరంట్ల పరిసర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి ఇసుక అక్రమంగా తరలించేవారిని గుర్తించినట్లు ఆయన పేర్కొన్నారు. తనిఖీల్లో రెండు లారీలు, మూడు ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తున్న వారిని గుర్తించి రూ.80 వేలు అపరాధరుసుం వసూలు చేసినట్లు తెలిపారు.

ప్రణాళికల దశలోనే చెరువుల అభివృద్ధి

ఆక్రమణలు పట్టించుకోని యంత్రాంగం

న్యూస్‌టుడే, నగరపాలకసంస్థ (గుంటూరు)

నగరపాలక సంస్థ పరిధిలోని నీటి వనరులను కాపాడుకోవడం అత్యంత ప్రాధాన్య విషయమైనా అధికారులు దృష్టి సారించక పోవడం విమర్శలకు తావిస్తోంది. అనేకచోట్ల చెరువులు, కుంటలకు రక్షణ లేకుండా పోవడంతో ఆక్రమణలకు గురై కుదించుకుపోతున్నాయి. ఇటీవల నగరంలో భారీ వర్షం కురడంతో గడ్డిపాడు చెరువు పరిసరాల చుట్టూ ఉన్న ఇళ్లల్లోకి వరదనీరు చేరి ప్రజలు అవస్థలు పడ్డారు. చెరువుల అభివృద్ధికి గతంలో ఉన్న అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశాలిచ్చారు. పలు చెరువులు, నీటి కుంటల చుట్టూ బండ్‌లను బలోపేతం చేయడంతో పాటు ప్రహరీల నిర్మాణం, వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు, ఓపెన్ జిమ్‌ల నిర్మాణం చేస్తే ప్రజోపయోగంగా ఉంటుందని భావించారు. దీనిలో భాగంగా నందివెలుగురోడ్డులోని చిన్నేరుకుంటను అభివృద్ధికి చర్యలు చేపట్టారు. కానీ ఈ పనులకు సమస్యలు వచ్చి మధ్యలోనే ఆపివేశారు. ఇక గడ్డిపాడు చెరువు, ఏటుకూరు రోడ్డులోని చాకలిగుంటలను పట్టించుకోకుండా వదిలేశారు.

ఆక్రమణలతోనే తంటా..: నగరంలో పూర్వం నుంచి నీటి వనరులుగా చెరువులు, కుంటలు భారీ విస్తీర్ణంలో ఉండేవి. వీటిపై అధికారుల దృష్టి పెట్టకపోవడం రక్షణ ఏర్పాట్లు చేయకపోవడంతో ఆక్రమణలు పెరిగిపోయాయి. నందివెలుగు రోడ్డులో చిన్నేరుకుంట సుమారు మూడు ఎకరాలకుపైగా ఉండగా అది ప్రస్తుతం ఒక ఎకరానికి లోపే ఉంది. చాకలిగుంట చుట్టూ అనేక ఆక్రమణలు ఉన్నాయి. గడ్డిపాడు చెరువు, నల్లచెరువు చుట్టూపక్కల అనేక ఆక్రమణలు ఏళ్లుగా ఉండడంతో అక్కడ పక్కా భవనాలు నిర్మించుకుని స్థానికులు ఉంటున్నారు. ఇలా ఆక్రమణలు పెరిగిపోతే ఉన్న నీటి వనరులు కూడా పూర్తిగా ఆక్రమణదారుల చేతిల్లోకి వెళ్లే ప్రమాదం ఉంది.



ఇన్నర్ రింగురోడ్డు ఆటోనగర్ గడ్డిపాడు వద్ద చెరువు

ప్రతిపాదనలు కార్యాచరణలోకి వస్తేనే..: చెరువుల అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలు కార్యాచరణలోకి వస్తేనే పరిసర ప్రాంతాల వాసులకు ఉపయోగకరంగా ఉంటుంది. పశ్చిమ నియోజకవర్గంలో గుజ్జనగుండ్ల చెరువును వాకింగ్ ట్రాక్, పార్కుగా అభివృద్ధి చేయడం వల్లే చుట్టూ ఉన్న అనేక ప్రాంతాల వాసులు ఉదయం నడక కోసం ఇక్కడికి వస్తూ వినియోగించుకుంటున్నారు. ఇలాగే తూర్పు నియోజకవర్గంలోని నీటి వనరుల చుట్టూ అభివృద్ధి చేయడం ద్వారా ప్రజలకు ఉపయోగపడుతుంది. చెరువుల చుట్టూ బండ్‌లను అభివృద్ధి చేయడం ద్వారా భారీ వర్షాలు పడినా వరద నీరు చుట్టుపక్కల నివాసాల్లోకి చేరకుండా ఉంటుంది. పక్కనే ఉన్న మురుగు కాల్వల నీటిని చెరువుల్లోకి రాకుండా చర్యలు చేపడతారు. తూర్పు నియోజకవర్గంలోని నల్లచెరువు వాకింగ్ ట్రాక్ వద్ద సమస్యలు పరిష్కరించడంతో పాటు గడ్డిపాడు చెరువు, చిన్నేరుకుంట, చాకలికుంటల అభివృద్ధి పనులపై కూడా అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



ఏటుకూరు రోడ్డులోని చాకలికుంట



అరండల్‌పేట: తహసీల్దారు కార్యాలయం వద్ద సీపీఎం నాయకుల ధర్నా

ఉచిత ఇసుకలో దళారీ వ్యవస్థను నివారించండి

నెహ్రూనగర్: ఉచిత ఇసుక పథకంలో దళారీ వ్యవస్థను నివారించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సీపీఎం నగర కార్యదర్శి నళినీకాంత్ డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం గుంటూరు తూర్పు, పశ్చిమ తహసీల్దారు కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్లకు వినతిపత్రం అందించారు. నాయకులు ముత్యాలరావు, నికల్సన్, ఖాసిం, వలి, బాషా, రమణ, శ్రీనివాసరావు, దీవెనరావు, కార్తీక్, సైదా, బుజ్జి పాల్గొన్నారు.

పేదలకు పెన్నిధి.. సీఎం సహాయనిధి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు పెన్నిధి అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ పేర్కొన్నారు. మంగళదాస్‌నగర్‌కు చెందిన ఇందుమతి అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స నిమిత్తం నగదు కోసం ఎమ్మెల్యే నసీర్‌ను సంప్రదించారు. ఆయన స్పందించి సీఎం సహాయ నిధి నుంచి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.1.65 లక్షలు మంజూరు చేయించారు. దీనికి సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే నసీర్ ఇంటికి వెళ్లి చెక్కు అందజేశారు.

ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌లో ఆకస్మిక తనిఖీ



దరఖాస్తుల నమోదును పరిశీలిస్తున్న సంయుక్త కలెక్టర్ భార్గవ్‌తేజ

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఎక్సైజ్ గుంటూరు-1 పోలీసుస్టేషన్‌ను శుక్రవారం సంయుక్త కలెక్టర్ భార్గవ్‌తేజ ఆకస్మిక తనిఖీ చేశారు. నూతన మద్యం పాలసీకి సంబంధించి ఎక్సైజ్‌శాఖ వ్యాపారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తోంది. ఈ క్రమంలో ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌లో సిబ్బంది ఆయా దరఖాస్తులను ఏ విధంగా నమోదు చేసుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. ఆ శాఖ ఉపకమిషనర్ శ్రీనివాసులు, ఈఎస్ అరుణకుమారీ, ఏఈఎస్ మారయ్యబాబులు నమోదు తీరును జేసీకి వివరించారు.

స్టాఫ్ నర్సులకు పదోన్నతి

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: వైద్య ఆరోగ్య శాఖలో స్టాఫ్ నర్సులుగా పని చేస్తున్న వారిలో అర్హులైన వారికి హెడ్ నర్సులుగా పదోన్నతిస్తూ ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకులు సుచిత్ర శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో ఆరుగురిని గుంటూరు జీజీహెచ్, ఇద్దరికి ఒంగోలు, మరొకరికి నెల్లూరు కేటాయించారు. గత జూన్ నుంచి వీరు పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్నారు. ఎట్టకేలకు మూడు నెలల తర్వాత వారికి ఉద్యోగోన్నతి దక్కింది.

చదువుతో పాటు క్రీడలూ ప్రధానమే

గుంటూరుక్రీడలు, న్యూస్‌టుడే: విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో క్రీడలూ అంతే ముఖ్యమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అన్నారు. శ్రీచైతన్య విద్యా సంస్థల ఆధ్వర్యంలో బీఆర్ స్టేడియంలో జరుగుతున్న క్రీడల్ని ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులపై ఎంతో ఒత్తిడి ఉంటుందని, దానిని అధిగమించేందుకు క్రీడల్లోనూ విద్యార్థుల్ని ప్రోత్సహించాలన్నారు. చైతన్య విద్యా సంస్థల ఏజీఎం ఈమని దుర్గాప్రసాద్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్పొరేటర్ ఎల్లావుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారుల్ని పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్

ఆరోగ్యవంతమైన ఉపాధ్యాయులతో మెరుగైన భావితరం

యూటీఎఫ్ రాష్ట్ర క్రీడా పోటీలు ప్రారంభం

నగరపాలక సంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు ఆరోగ్యవంతంగా ఉండటం ద్వారానే మెరుగైన భావితరం రూపొందుతుందని ఎమ్మెల్సీ కేఎస్.లక్ష్మణరావు అన్నారు. స్థానిక బృందావన్‌గార్డెన్స్ ఎన్టీఆర్ స్టేడియంలో శుక్రవారం యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు సందర్భంగా రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఏపీ జేఏసీ ఛైర్మన్ శివారెడ్డి క్రీడా జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అతిథులు వివిధ జిల్లా నుంచి వచ్చిన ఉపాధ్యాయుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ జాతీయ విద్యావిధానం- 2020 లాంటి ప్రైవేటీకరణ విధానాలను తిప్పుకొట్టేందుకు యూటీఎఫ్ ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలన్నారు. తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ మాట్లాడుతూ విద్యారంగాన్ని పటిష్ఠం చేసేందుకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కె.ఎస్.ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ విద్యారంగం, ఉపాధ్యాయ సంక్షేమానికి యూటీఎఫ్ చేసిన కృషిని వివరించారు. యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు ఏఎన్.కుసుమకుమారి, గౌరవాధ్యక్షులు కె.శ్రీనివాసరావు, రాష్ట్ర కోశాధికారి గోపిమూర్తి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడా జ్యోతి వెలిగిస్తున్న ఏపీ జేఏసీ ఛైర్మన్ శివారెడ్డి, పక్కన ఎమ్మెల్సీలు లక్ష్మణరావు, వెంకటేశ్వరరావు తదితరులు

జననిి.. దివ్వరూపిణి



వీవర్స్‌కాలనీలో ధనలక్ష్మీదేవిగా..



కొత్తపేట శివాలయంలో బాలాత్రిపురసుందరీదేవి



కాకానిరోడ్డులో గాయత్రీదేవి



జెండాచెట్టువీధిలో చాముండేశ్వరిదేవి



సీతానగర్‌లో గాయత్రీదేవి



లాలాపేట వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఐశ్వర్యలక్ష్మి



జగన్నాథస్వామి దేవస్థానంలో ధనలక్ష్మి



న్యూగుంటూరు సమీపంలో బాలాత్రిపురసుందరీదేవి

నగరంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు రెండవ రోజు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. దేవాదాయశాఖకు చెందిన లాలాపేట వెంకటేశ్వరస్వామి ఆలయం, జగన్నాథస్వామి, కొత్తపేట శివాలయంతోపాటు గుంటూరువారితోట, ఆర్టీసీ కాలనీ, మంగళదాస్‌నగర్, బుచ్చయ్యతోట, నెహ్రూనగర్, మోతీలాల్‌నగర్, పరమయ్యకుంట, సీతానగర్, కొత్తపేట, కాకుమానువారివీధి, రైలుపేట తదితర ప్రాంతాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. సాయంత్రం అమ్మవారికి నిర్వహించిన కుంకుమపూజల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, నెహ్రూనగర్, పట్నంబజారు



సోమువారివీధిలో బతుకమ్మకు పూజలు



చినమహాలక్ష్మి ఆలయంలో కుంకుమ పూజలు



లాంచెస్టర్‌రోడ్డులోని కనక దుర్గ అమ్మవారి దేవస్థానంలో..



పాతగుంటూరులోని సీతారామాలయంలో..



ఏటుకూరురోడ్డులోని కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో



గంటలమ్మచెట్టువీధిలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో..

గుంటూరు ఎస్పీకి అవార్డు

గుంటూరు నేరవార్తలు: జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌కు డీజీపీ ఏబీసీ అవార్డు లభించింది. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ప్రధాన కేసుల ఛేదనలో ప్రతిభ కనపరచిన పోలీసులకు ఈ అవార్డు అందిస్తారు. గత ఏడాది కాకినాడలో ఓ బ్యాంక్ రాబరీ కేసును అప్పటి ఎస్పీగా పనిచేసిన సతీష్‌కుమార్ చాకచక్యంగా ఛేదించి నిందితులను త్వరగా పట్టుకోవడంతోపాటు చోరీకి గురైన సొత్తు కిలో బంగారం, రూ.20 లక్షల నగదు జప్తు చేయడంతో డీజీపీ ఏడీసీ అవార్డుకు ఎంపిక చేశారు. శుక్రవారం డీజీపీ ద్వారకా తిరుమలరావు చేతుల మీదుగ ఆయన అవార్డు స్వీకరించారు. దీనితోపాటు ఇటీవల జరిగిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో జిల్లాలో అత్యధిక కేసులు పరిష్కరించి రాష్ట్రంలోనే ద్వితీయస్థానంలో నిలిచింది. లోక్ అదాలత్ విభాగంలో మరో అవార్డును డీజీపీ అందించి ఎస్పీ సతీష్‌కుమార్‌ని అభినందించారు.




డీజీపీ నుంచి అవార్డు స్వీకరిస్తున్న ఎస్పీ

ఎక్సైజ్ సీఐలు బాధ్యతల స్వీకరణ

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం సీఐలుగా ఎ.రేఖ, ఎన్.కోటేశ్వరరావు శుక్రవారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. వీళ్లు గతంలో గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని పలు పోలీసుస్టేషన్‌లలో, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, డిస్టిలరీ డిపోల్లో విధులు నిర్వహించారు. ఇటీవల జరిగిన బదీలలో గుంటూరు జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి నియమితులయ్యారు. నాటు సారా తయారీ, విక్రయాలు, గంజాయి, మత్తుపదార్థాలు, మద్యం అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



సీఐ రేఖ



సీఐ కోటేశ్వరరావు

విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయులే కీలకం

ఏటీ అగ్రహారం: ఆంధ్రప్రదేశ్ ఎంఈడీ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బి.రమేష్ ఆధ్వర్యంలో 'ది రోల్ ఆఫ్ టీచర్ ఏడ్యూకేటర్స్ ఇన్ ఎమర్జింగ్ ఇండియా' పుస్తకాన్ని ఏపీ హయ్యర్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ, మోనటరింగ్ కమిషన్ ప్రొఫెసర్ డి.సూర్యచంద్రరావు శుక్రవారం ఆవిష్కరించారు. ప్రొఫెసర్ సూర్యచంద్రరావు మాట్లాడుతూ విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు.

ఇన్‌ఛార్జి డీఐవోగా లక్ష్మానాయక్

గుంటూరు వైద్యం: జిల్లా ఇన్‌ఛార్జి ఇమ్యునైజేషన్ అధికారిగా లక్ష్మానాయక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన సుబ్బరాజు కాకినాడకు బదిలీపై వెళ్లారు. దీంతో జిల్లా న్యూక్లియస్ వైద్యాధికారిగా పని చేస్తున్న లక్ష్మానాయక్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ డీఎంహెచ్‌వో విజయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు.

శిక్ష అనుభవించేందుకు సిద్ధంగా ఉండాలి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి వినియోగించారన్న అంశంపై సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను స్వాగతిస్తున్నామని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. అయిదుగురు సభ్యులతో కూడిన స్వతంత్ర సిట్ ఏర్పాటుతో అసలు విషయాలు బయటకు వస్తాయి. జగన్ పాలనలో తిరుమల కొండను అపవిత్రం చేశారు. అర్హత లేని కంపెనీలకు నెయ్యి టెండర్లు ఎలా ఇచ్చారు. ఇకనైనా శిక్ష అనుభవించేందుకు సిద్ధంగా ఉండాలి' .. అని హితవు పలికారు.

ముగ్గురి ప్రాణాలు కాపాడిన పోలీసులు

ఇద్దరు పసిపిల్లలతో ఆత్మహత్యకు యత్నించిన తల్లి

నెహ్రూనగర్ (గుంటూరు), న్యూస్‌టుడే: ఆత్మహత్యకు యత్నించిన తల్లి, ఆమె ఇద్దరు పసిపిల్లల్ని శుక్రవారం గుంటూరు పోలీసు కాపాడారు. పోలీసుల కథనం ప్రకారం... స్థానిక శ్రీనివాసరావుపేటకు చెందిన షేక్ హసీనాకు ఆటోడ్రైవర్ సుభానీతో నాలుగు సంవత్సరాల కిందట వివాహమయ్యింది. వీరికి రెండేళ్లు, 11 నెలల ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. కొద్దిరోజుల కిందట భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో హసీనా పుట్టింటికి తన పిల్లల్ని తీసుకొని వచ్చింది. రోజులు గడిచినా భర్త కాపురానికి తీసుకువెళ్లకపోవడంతో మనస్తాపం చెందిన హసీనా శుక్రవారం ఉదయం తన ఇద్దరు పిల్లలతో సహా చనిపోవాలని విజయవాడ ప్రకాశం బ్యారేజ్ వద్దకు బయలుదేరింది. మార్గమధ్యలో ఈ విషయాన్ని తన తల్లి నూర్జహాన్‌కి ఫోన్ చేసి ఏడుస్తూ చెప్పింది. తల్లి నగరంపాలెం పోలీసుస్టేషన్‌కు వచ్చి సీఐ వీరానాయక్‌కు చెప్పి కాపాడాలని వేడుకుంది. స్పందించిన సీఐ ఎస్పీ సతీష్‌కుమార్‌కు తెలియజేయడంతో ఆయన స్వయంగా రంగంలోకి దిగి గుంటూరు, తాడేపల్లిలోని పోలీసులు, కంట్రోల్ రూం సిబ్బందిని అప్రమత్తం చేశారు. హసీనా ఆమె ఇద్దరు పిల్లలతో బ్యారేజి వద్దకు చేరుకొని పిల్లలను నదిలోకి వేయటానికి ప్రయత్నిస్తున్నక్రమంలో నలువైపుల నుంచి పోలీసులు అక్కడకు చేరుకొని ఆమెను నిలువరించారు. పిల్లలతో సహా ఆమెను కాపాడి గుంటూరు ఎస్పీ కార్యాలయానికి తీసుకువచ్చారు. హసీనాతోపాటు ఆమె భర్త సుభానీలను ఎస్పీ తన కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. తల్లి నూర్జహాన్‌కు తన కుమార్తె హసీనా ఆమె పిల్లలను అప్పగించారు. ముగ్గురు ప్రాణాలు కాపాడిన పోలీసులకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.



భార్యా భర్తకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

చలపతి కళాశాలకు జాతీయ అవార్డులు

తాడికొండ, న్యూస్‌టుడే: లాం చలపతి ఇంజినీరింగ్ కళాశాలకు జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మక అవార్డులు వరించాయని ప్రిన్సిపల్ ఎం.చంద్రశేఖర్ శుక్రవారం తెలిపారు. ఏఐసీటీఈ, ఎడ్యుస్కిల్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో ఏఐసీటీఈ ఛైర్మన్ సీతారాం, సౌత్ ఏషియన్ యూనివర్సిటీ అధ్యక్షుడు క్రిషన్ అగర్వాల్ చేతుల మీదుగా ప్రిన్సిపల్ చంద్రశేఖర్ వీటిని అందుకున్నారు. ఇంజినీరింగ్ కళాశాలల విభాగంలో లాం చలపతి జాతీయ స్థాయి 8వ ర్యాంకు కైవసం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. కళాశాల ఛైర్మన్ వైవీ ఆంజనేయులు, కార్యదర్శి సుజిత్ కుమార్ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నామని చెప్పారు.



జాతీయ స్థాయి అవార్డులు అందుకున్న ప్రిన్సిపల్ చంద్రశేఖర్, ఛైర్మన్ వై.వి ఆంజనేయులు

పోలీసుల అదుపులో అంతర్‌రాష్ట్ర దొంగ?

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: నగరంలో ఇటీవల జరిగిన ఓ చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఆ కేసులో అంతర్‌రాష్ట్ర దొంగను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. కొద్ది రోజుల కిందట ఎస్వీఎన్ కాలనీలోని ఓ ఇంటిలో దొంగతనం జరిగింది. భారీ మొత్తంలో బంగారు వస్తువులు అపహరించుకెళ్లినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై ఎస్పీ సతీష్‌కుమార్ ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. సంఘటనా స్థలంలో లభించిన ప్రాథమిక ఆధారాలు, నిఘానేత్రాల్లోని దృశ్యాలు ఆధారంగా పాత నిందితుడిగా గుర్తించారు. గత వారం రోజులుగా ఆ దొంగకోసం తీవ్రంగా గాలింపులు చేపట్టారు. అతనిపై నాలుగు రాష్ట్రాల్లో దొంగతనం కేసులు నమోదైనట్లు పోలీసుల దర్యాప్తులో గుర్తించారు.

గుంటూరు పశ్చిమ

ఇన్‌ఛార్జి డీఐవోగా లక్ష్మానాయక్


ఇన్‌ఛార్జి డీఐవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న లక్ష్మానాయక్

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: జిల్లా ఇన్‌ఛార్జి ఇమ్యూనైజేషన్ అధికారిగా లక్ష్మానాయక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన సుబ్బరాజు కాకినాడకు బదిలీపై వెళ్లారు. దీంతో జిల్లా న్యూక్లియస్ వైద్యాధికారిగా పని చేస్తున్న లక్ష్మానాయక్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ డీఎంహెచ్‌వో విజయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు.

స్టాఫ్ నర్సులకు పదోన్నతి

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: వైద్య ఆరోగ్య శాఖలో స్టాఫ్ నర్సులుగా పని చేస్తున్న వారిలో అర్హులైన వారికి హెడ్ నర్సులుగా పదోన్నతినిస్తూ ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకులు సుచిత్ర శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో ఆరుగురిని గుంటూరు జీజీహెచ్, ఇద్దరికి ఒంగోలు, మరొకరికి నెల్లూరు కేటాయించారు. గత జూన్ నుంచి వీరు పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్నారు. ఎట్టకేలకు మూడు నెలల తర్వాత వారికి ఉద్యోగోన్నతి దక్కింది.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
97042 53525, 80085 74897

స్పందనకు వందనం

చెట్ల కొమ్మల తొలగింపు: లక్ష్మీపురం ప్రధాన రహదారిలోని కాల్వలో మురుగు, చెత్త పేరుకుపోవడం, రహదారులకు అడ్డుగా చెట్లకొమ్మలు ఉన్నాయి. సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంగడి బాబు దృష్టికి తీసుకెళ్లాం. ఆయన పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి సమస్య పరిష్కరించారు.

డ్రెయిన్లలో పూడికతీత: బ్రాడీపేట ఒకటో వీధిలోని మురుగు కాల్వల్లో మురుగు, చెత్త పేరుకుపోయింది. సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంగడి బాబు దృష్టికి తీసుకెళ్లాం. సిబ్బందిని పంపి పూడిక తీయించారు.

సమస్య పరిష్కారం: సంగడిగుంటలోని డ్రెయిన్లలో వ్యర్థాలు పేరుకుపోయి నీటి పారుదలకు ఆటంకంగా మారింది. సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా శానిటరీ ఇన్‌స్పెక్టర్ అడపా వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లాం. ఆయన పారిశుద్ధ్య సిబ్బందిని పంపి సమస్య పరిష్కరించారు. **-న్యూస్‌టుడే, బ్రాడీపేట**

జీజీహెచ్‌లో వాహనాలకు భద్రతేది?


జీజీహెచ్ అత్యవసర వైద్యసేవల విభాగంలో అక్రమంగా పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు

పట్టించుకోని ప్రయివేటు రక్షణ సిబ్బంది

నగరంపాలెం, న్యూస్‌టుడే

గత నెల 14వ తేదీ రాత్రి గుంటూరు రూరల్ మండలం ఏటుకూరువాసి తన బంధువుకు భోజనం ఇవ్వడానికి వచ్చారు. అరగంటలో తిరిగి వెళ్లగా అక్కడ ద్విచక్ర వాహనం కనిపించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు ఆసుపత్రి నిఘా కెమెరాలు పరిశీలించగా బండిపై కూర్చొని దొంగ తాళం తీసి తీసుకెళ్లారు. ఇటువంటివి తరచుగా జరుగుతూనే ఉన్నాయి.

సర్వజనాసుపత్రిలో వాహనాల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. పార్కింగ్‌లో పెట్టిన ద్విచక్ర వాహనాలు, వార్డుల్లో ఛార్జింగ్‌లో పెట్టిన చరవాణులు అపహరణకు గురవుతున్నాయి. చికిత్స నిమిత్తం వచ్చే రోగులు, వారి సహాయకులు వస్తువులను కోల్పోవడం, ఆర్థికంగా నష్టపోవడంతో తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ఆసుపత్రిలో నిత్యం క్రైమ్ బ్రాంచి సిబ్బంది తిరుగుతున్నా వీటిని అరికట్టలేకపోవడం ఆసుపత్రి ప్రతిష్ఠకు మచ్చగా మారింది.


జీజీహెచ్ అత్యవసర వైద్యసేవల విభాగంలోని సెల్లార్‌లో అక్రమ పార్కింగ్

పార్కింగ్‌లో ప్రయివేటు వాహనాలే అధికం

నిత్యం ఆరు జిల్లాల నుంచి వేల సంఖ్యలో ప్రజలు వైద్యం కోసం జీజీహెచ్‌కు వస్తుంటారు. రోగికి పరీక్షలు నిర్వహించిన అనంతరం వైద్యుల సూచనలతో వార్డుల్లో చేరుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఎక్కడికైనా వెళ్లాల్సి వస్తుందని రోగి సహాయకులు వాహనం వెంట తెచ్చుకుంటున్నారు. ఆసుపత్రి ఆవరణలో పార్కింగ్ చేస్తే.. అవి చోరీకి గురవుతున్నాయి. పార్కింగ్ సిబ్బంది వాహనాల రక్షణను పట్టించుకోకపోవడంతో ఈ దుస్థితి దాపురించింది.

★ జీజీహెచ్ పరిపాలన భవనం, నాట్కో క్యాన్సర్ భవనం, అత్యవసర వైద్య సేవల విభాగం సమీపంలో ఇబ్బడి ముబ్బడిగా ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు ఆసుపత్రిలోకి రావడంతో రోగులు వైద్యుల వద్దకు చేరేందుకు అవస్థలు పడుతున్నారు.

ప్రతి నెలా పోతున్న చరవాణులు:	100
ద్విచక్ర వాహనాలు :	15 నుంచి 20

★ ఆసుపత్రిలోని పార్కింగ్ గుత్తేదారుడు రక్షణ సిబ్బందిని సరైన వారిని పెట్టకపోవడంతో సమస్య జటిలమవుతోంది.

★ అడ్డదిడ్డంగా పార్కింగ్ చేసినా సిబ్బంది సరి చేయడంలేదు. దీంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.

★ ద్విచక్ర వాహనాల దొంగతనం జరిగినప్పుడు, సిబ్బందికి పార్కింగ్ టోకెన్ చూపించి వాహనం ఇప్పించాలని కోరినా వారు సరైన సమాధానం చెప్పడంలేదంటున్నారు.

★ ఉద్యానవనంలో కూడా పార్కింగ్ నిర్వహిస్తూ.. కూర్చునేందుకు జాగా కూడా లేకుండా చేస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు.

వార్డుల్లో సీసీ కెమెరాలు ఉన్నా..

అన్ని వార్డుల్లో సీసీ కెమెరాలు ఉన్నా చరవాణుల దొంగతనం నిత్యం జరుగుతుండటంతో పోలీసులు కూడా వారిని పట్టుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. చరవాణుల దొంగతనంలో జీజీహెచ్ సిబ్బంది చేతివాటం కూడా ఉందని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లా..

- డాక్టర్ వై.కిరణ్‌కుమార్

పార్కింగ్ వ్యవహారం, చోరీలు జరుగుతుండడంపై కలెక్టర్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుల దృష్టికి తీసుకెళ్లాను. నడకదారిని ఆక్రమించి కొందరు వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. వాటిని తొలగించాలని నగరపాలక సంస్థ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాను. వాటిని తొలగిస్తే.. అక్కడ వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేయడం ద్వారా సమస్య పరిష్కారమవుతుంది. పార్కింగ్ టెండర్ నిర్వహించేందుకు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాను.

ఇసుక అక్రమ రవాణా వాహనాల సీజ్

కలెక్టరేట్, న్యూస్‌టుడే: అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న రెండు లారీలు, మూడు ట్రాక్టర్లను గుంటూరు తూర్పు మండలం ఆర్ఐ తనిఖీలు చేసి సీజ్ చేశారు. అమరావతి రోడ్డులోని గోరంట్ల ప్రాంతాల్లో అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను రవాణా చేస్తున్నట్లు గుర్తించిన అధికారుల ఒక్కో లారీకి రూ.25 వేలు, ఒక్కో ట్రాక్టరుకు రూ.10 వేల చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు.

సైకియాట్రీ సొసైటీ నూతన కార్యవర్గం

గుంటూరు వైద్యం: గుంటూరు సైకియాట్రీ సొసైటీ నూతన కార్యవర్గం శుక్రవారం బాధ్యతలు చేపట్టింది. ఐఎంఏ సమావేశ మందిరంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అధ్యక్షుడిగా సర్వజనాసుపత్రి సహాచార్యులు వెంకట కిరణ్, కార్యదర్శిగా సహాయ ఆచార్యులు సాయి కిరణ్, కోశాధికారిగా సహాయ ఆచార్యులు నివాస్, సంయుక్త కార్యదర్శిగా జగదీష్ పదవీ బాధ్యతలు తీసుకున్నారు. సమావేశంలో సీనియర్ వైద్యులు కోట సురేష్‌కుమార్, ఉమా జ్యోతి, వైద్యులు, విద్యార్థి వైద్యులు పాల్గొన్నారు.

వైకాపా నగర అధ్యక్షుడిగా బాలవజ్రబాబు

గోరంట్ల, న్యూస్‌టుడే: వైకాపా గుంటూరు నగర అధ్యక్షుడిగా వనమా బాలవజ్రబాబును నియమిస్తూ పార్టీ అధిష్ఠానం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో నగర అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే మద్దాలి గిరిధరరావును నియమించింది. ఆయన పార్టీని వీడారు. ఈ నేపథ్యంలో నగర అధ్యక్షుడిగా డిప్యూటీ మేయర్ బాలవజ్రబాబును నియమించారు.

వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించాలి

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: కుష్ఠు, క్షయ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా న్యూక్లియస్ వైద్యాధికారి లక్ష్మానాయక్ సూచించారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో శుక్రవారం జరిగిన వైద్యాధికారుల సమావేశంలో లక్ష్మానాయక్ మాట్లాడారు. ప్రాథమిక దశలో వ్యాధిని గుర్తించి వైద్యం చేయించుకోకుంటే చేతులు, కాళ్ల వైకల్యానికి దారి తీస్తుందనే విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. డీఎంహెచ్‌వో విజయలక్ష్మి, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నివారణ అధికారి దాసరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ సీఐలు బాధ్యతల స్వీకరణ


సీఐలు రేఖ, కోటేశ్వరరావు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం సీఐలుగా ఎ.రేఖ, ఎన్.కోటుశ్వరరావు శుక్రవారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. వీళ్లు గతంలో గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని పలు పోలీసు స్టేషన్‌లలో, స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో, డిస్టిలరీ డిపోల్లో విధులు నిర్వహించారు. ఇటీవల జరిగిన బదీలలో గుంటూరు జిల్లా ఎన్‌ఫోర్సుమెంట్ విభాగానికి నియమితులయ్యారు.

చలపతి కళాశాలకు జాతీయ అవార్డులు


జాతీయ స్థాయి అవార్డులు అందుకున్న ప్రిన్సిపల్ చంద్రశేఖర్, ఛైర్మన్ వైవీ ఆంజనేయులు

తాడికొండ, న్యూస్‌టుడే: లాం చలపతి ఇంజినీరింగ్ కళాశాలకు జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మక అవార్డులు వరించాయని ప్రిన్సిపల్ ఎం.చంద్రశేఖర్ శుక్రవారం తెలిపారు. ఏఐసీటీఈ, ఎడ్యుస్కిల్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో న్యూదిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో ఏఐసీటీఈ ఛైర్మన్ సీతారాం, సౌత్ ఏషియన్ యూనివర్సిటీ అధ్యక్షుడు క్రిషన్ అగర్వాల్ చేతుల మీదుగా ప్రిన్సిపల్ చంద్రశేఖర్ వీటిని అందుకున్నారు. ఇంజినీరింగ్ కళాశాలల విభాగంలో లాం చలపతి జాతీయ స్థాయి 8వ ర్యాంకు కైవసం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. కళాశాల ఛైర్మన్ వైవీ ఆంజనేయులు, కార్యదర్శి సుజిత్ కుమార్ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నామని చెప్పారు.

అటవీ శాఖ అధికారి బదిలీ

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లా అటవీ శాఖ అధికారి మహబూబ్ బాషా నెల్లూరు జిల్లాకు బదిలీ అయ్యారు. గుంటూరు పీసీసీఎఫ్ కార్యాలయం డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఐ.కాసివిశ్వనాథ రాజుకు పీసీసీఎఫ్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

గుంటూరు ఎస్పీకి అవార్డు


డీజీపీ నుంచి అవార్డు స్వీకరిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌కు డీజీపీ ఏబీసీ అవార్డు లభించింది. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ప్రధాన కేసుల ఛేదనలో ప్రతిభ కనపరచిన పోలీసులకు ఈ అవార్డు అందిస్తారు. గత ఏడాది కాకినాడలో ఓ బ్యాంక్ రాబరీ కేసును అప్పటి ఎస్పీగా పనిచేసిన సతీష్‌కుమార్ చాకచక్యంగా కేసును ఛేదించి నిందితులను త్వరగా పట్టుకోవడంతోపాటు చోరీకి గురైన సొత్తు కిలో బంగారం, రూ.20 లక్షల నగదు జప్తు చేయడంతో డీజీపీ ఏడీసీ అవార్డుకు ఎంపిక చేశారు. శుక్రవారం డీజీపీ ద్వారకా తిరుమలరావు చేతుల మీదుగ ఆయన అవార్డు స్వీకరించారు. దీనితోపాటు ఇటీవల జరిగిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో జిల్లాలో అత్యధిక కేసులు పరిష్కరించి రాష్ట్రంలోనే ద్వితీయ స్థానంలో నిలిచింది. లోక్ అదాలత్ విభాగంలో మరో అవార్డును డీజీపీ అందించి ఎస్పీ సతీష్‌కుమార్‌ని అభినందించారు.

49,880 మిర్చి బస్తాల విక్రయం

మిర్చియార్డు, న్యూస్‌టుడే: మిర్చియార్డులో 49,880 బస్తాల విక్రయాలు జరిగాయి. రైతులు శుక్రవారం 42,191 బస్తాలు యార్డుకు తరలించారు. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో 19,029 బస్తాలు నిల్వ ఉన్నాయి.


30 లోపు ఏపీజీఎన్ఏ ఎన్నికలు

గుంటూరు వైద్యం: ఏపీ ప్రభుత్వ నర్సుల సంఘం ఎన్నికలు ఈనెల 30వ తేదీ లోపు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లా సహకార శాఖ అధికారి ఎన్.శ్రీనివాసరెడ్డిని ఎన్నికల అధికారిగా ప్రభుత్వం నియమించింది. ఇందులో భాగంగా జీజీహెచ్‌లో శుక్రవారం ఆ సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహించి ఎన్నికల విధి, విధానాలపై చర్చించినట్లు పద్మజ తెలిపారు.

ఆకట్టుకున్న సంకీర్తన గానం

గుంటూరు సాంస్కృతికం: అన్నమయ్య కళావేదికపై శుక్రవారం రాత్రి జరిగిన సంకీర్తన గానం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఎం.వై.శేషరాణి, భువనేశ్వరి దేవీ కీర్తనల గానం చేశారు. మస్తానయ్య, ఊటుకూరి నాగేశ్వరరావు, నిఘంటువు రచయిత పెద్ది సాంబశివరావు పాల్గొన్నారు.

జగజ్జననికి జన నీరాజనాలు


విద్యానగర్ సాయినాథ సన్నిధానంలో బొమ్మలకొలువు


ఏటి అగ్రహారంలో..


గాయత్రీ దత్తసాయి ఆలయంలో..


కృష్ణనగర్ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో..


బ్రాడీపేట 2/14లోని శంకర మందిరంలో..


పెదపలకలూరు రోడ్డు అదితినగర్‌లో..


సీతారాంనగర్ సీతారామస్వామి దేవస్థానంలో భక్తుల పూజలు


మల్లారెడ్డినగర్ అయ్యప్ప ఆలయంలో

నగరంలోని దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం అమ్మవారు శ్రీగాయత్రీదేవి రూపంలో దర్శనమిచ్చారు. ఆలయాలతో పాటు పలు వీధుల్లో ఏర్పాటు చేసిన పందిళ్లలో అమ్మవారి విగ్రహాలకు నిత్యం ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు చేస్తున్నారు. ఈసారి అదనంగా బొమ్మల కొలువులు కూడా ఏర్పాటు చేశారు. ఆలయాల్లో కుంకుమార్చనలు, శ్రీచక్రార్చనలు, లలితా సహస్రనామాలు, శ్రీసూక్త పారాయణలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. పలుచోట్ల మహాలక్ష్మి, ధనలక్ష్మీదేవి, అన్నపూర్ణాదేవిగా అమ్మవారిని అలంకరించి పూజలు చేశారు.

- గుంటూరు సాంస్కృతికం, పట్టాభిపురం, ఏటీ అగ్రహారం, ఎస్వీఎన్ కాలనీ, న్యూస్‌టుడే:


వికాస్‌నగర్‌లోని షిర్డీ సాయి మందిరంలో లలితాదేవిగా..


అష్టలక్ష్మి దేవాలయంలో కుంకుమ పూజల్లో మహిళలు


మారుతీనగర్ మారుతీ దేవాలయంలో కుంకుమార్చనలు


శారదా పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారి ఊరేగింపు


స్తంభాలగరువులోని కోదండ రామాలయంలో


రామలింగేశ్వరస్వామి దేవాలయంలో మహాలక్ష్మీగా..


బృందావన గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో అన్నపూర్ణాదేవి అలంకారం

ఆరోగ్యవంతమైన ఉపాధ్యాయులతో మెరుగైన భావితరం

యూటీఎఫ్ రాష్ట్ర క్రీడా పోటీలు ప్రారంభం


క్రీడా జ్యోతి వెలిగిస్తున్న ఏపీ జేఏసీ ఛైర్మన్ శివారెడ్డి, పక్కన ఎమ్మెల్సీలు లక్ష్మణరావు, వెంకటేశ్వరరావు తదితరులు

నగరపాలక సంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు ఆరోగ్యవంతంగా ఉండటం ద్వారానే మెరుగైన భావితరం రూపొందుతుందని ఎమ్మెల్సీ కేఎస్.లక్ష్మణరావు అన్నారు. స్థానిక బృందావన్‌గార్డెన్స్ ఎన్టీఆర్ స్టేడియంలో శుక్రవారం యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు సందర్భంగా రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఏపీ జేఏసీ ఛైర్మన్ శివారెడ్డి క్రీడా జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అతిథులు వివిధ జిల్లా నుంచి వచ్చిన ఉపాధ్యాయుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ జాతీయ విద్యావిధానం- 2020 లాంటి ప్రైవేటీకరణ విధానాలను తిప్పికొట్టేందుకు యూటీఎఫ్ ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలన్నారు. తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ మాట్లాడుతూ విద్యారంగాన్ని పటిష్ఠం చేసేందుకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కె.ఎస్.ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ విద్యారంగం, ఉపాధ్యాయ సంక్షేమానికి యూటీఎఫ్ చేసిన కృషిని వివరించారు. యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు ఏఎన్.కుసుమకుమారి, గౌరవాధ్యక్షులు కె.శ్రీనివాసరావు, రాష్ట్ర కోశాధికారి గోపిమూర్తి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీల ఉత్తర్వులపై సంతకాలకు పాట్లే

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లా పంచాయతీరాజ్ శాఖలో ఉద్యోగుల బదిలీల ప్రక్రియ రోజులుగా కొనసాగుతూనే ఉంది. గడువు ముగిసిన తర్వాత కూడా మార్పులు, చేర్పులు చేశారు. జిల్లాపరిషత్ ఇన్‌ఛార్జి సీఈవోగా అదనపు బాధ్యతలు నిర్వహించిన డిప్యూటీ సీఈవో మోహన్‌రావు బదిలీ ఉత్తర్వులపై సంతకాలు చేయకపోవడంతో జడ్పీ ఉద్యోగులు 20 మంది నెల్లూరు వెళ్లి ఆయనతో పాత తేదీతో సంతకాలు చేయించుకుని రావాల్సి వచ్చింది. శుక్రవారం కొందరికి ఉత్తర్వులు అందజేశారు. సెప్టెంబరు 21న ఆమోదించిన నోట్ ఫైల్‌లో పేర్కొన్న ఉద్యోగులకు సంబంధించి బదిలీ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. మండల పరిషత్తు కార్యాలయాలు, జడ్పీ ఉన్నత పాఠశాలల్లో గతంలో బదిలీ చేసిన వారి స్థానంలో వేరే వారిని బదిలీ చేశారు. కొందరు ఉత్తర్వులు రద్దు చేశారు. దాంతో తమ పరిస్థితి ఏమిటో తెలియడం లేదని ఉద్యోగులు వాపోతున్నారు.

★ జిల్లాపరిషత్తు కార్యాలయం నుంచి మండల పరిషత్తు కార్యాలయాలకు బదిలీ అయిన పరిపాలన అధికారులు కొందరిని ఎంపీడీవోలు విధుల్లోకి చేర్చుకోలేదు. శుక్రవారం పలువురు ఏవోలు వెళ్లి విధుల్లోకి చేరతామనడంతో చేర్చుకున్నారు. మండలాల నుంచి జడ్పీకి బదిలీ అయిన ఏవోలు కూడా బాధ్యతలు స్వీకరించారు. రికార్డు అసిస్టెంట్లు, జూనియర్, సీనియర్ అసిస్టెంట్ల విషయంలోనే సమస్యలు ఎదురవుతున్నాయి.

విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయులే కీలకం


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ సూర్యచంద్రరావు తదితరులు

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ఎంఈడీ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బి.రమేష్ ఆధ్వర్యంలో 'ది రోల్ ఆఫ్ టీచర్ ఏడ్యుకేటర్స్ ఇన్ ఎమర్జింగ్ ఇండియా' పుస్తకాన్ని ఏపీ హయ్యర్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ, మోనటరింగ్ కమిషన్ ప్రొఫెసర్ డి.సూర్యచంద్రరావు శుక్రవారం ఆవిష్కరించారు. ప్రొఫెసర్ సూర్యచంద్రరావు మాట్లాడుతూ విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. ఉపాధ్యాయులందరూ తప్పనిసరిగా చదవాల్సిన పుస్తకమని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.వసంతరావు, డాక్టర్ అనంతలక్ష్మి, డాక్టర్ క్రాంతికుమార్, డాక్టర్ నిర్మల, రవి, డాక్టర్ జె.వి.సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ రాణించాలి


ఎంపికైన విద్యార్థులతో విష్ణువర్ధన్

గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లోనూ రాణించాలని పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల కార్యదర్శి విష్ణువర్ధన్ సూచించారు ఇటీవల నరసారావుపేటలో జరిగిన జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఆయన శుక్రవారం అభినందించారు. అండర్-14 విభాగంలో అభినయ, శశి, షణ్ముఖ, అండర్-17 విభాగంలో సుధారాణి, అక్షయ్య, జ్ఞానచరిత, నిహారిక ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ కృష్ణవేణి, ప్రిన్సిపల్ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురి ప్రాణాలు కాపాడిన పోలీసులు

ఇద్దరు పసిపిల్లలతో సహా ఆత్మహత్యకు యత్నించిన తల్లి


భార్యా భర్త, కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

నెహ్రూనగర్ (గుంటూరు), న్యూస్‌టుడే: ఆత్మహత్యకు యత్నించిన తల్లి, ఆమె ఇద్దరు పసిపిల్లల్ని శుక్రవారం గుంటూరు పోలీసు కాపాడారు. పోలీసుల కథనం ప్రకారం... స్థానిక శ్రీనివాసరావుపేటకు చెందిన షేక్ హసీనాకు ఆటోడ్రైవర్ సుభానీతో నాలుగు సంవత్సరాల కిందట వివాహమయ్యింది. వీరికి రెండేళ్లు, 11 నెలల ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. కొద్దిరోజుల కిందట భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో హసీనా పుట్టింటికి తన పిల్లల్ని తీసుకొని వచ్చింది. రోజులు గడిచినా భర్త కాపురానికి తీసుకువెళ్లకపోవడంతో మనస్తాపం చెందిన హసీనా శుక్రవారం ఉదయం తన ఇద్దరు పిల్లలతో సహా చనిపోవాలని విజయవాడ ప్రకాశం బ్యారేజ్ వద్దకు బయలుదేరింది. మార్గమధ్యలో ఈ విషయాన్ని తన తల్లి నూర్జహాన్‌కి ఫోన్ చేసి ఏడుస్తూ చెప్పింది. తల్లి నగరంపాలెం పోలీసు స్టేషన్‌కు వచ్చి సీఐ వీరానాయక్‌కు చెప్పి కాపాడాలని వేడుకుంది. స్పందించిన సీఐ ఎస్పీ సతీష్‌కుమార్‌కు తెలియజేయడంతో ఆయన స్వయంగా రంగంలోకి దిగి గుంటూరు, తాడేపల్లిలోని పోలీసులు, కంట్రోల్ రూం సిబ్బందిని అప్రమత్తం చేశారు. హసీనా ఆమె ఇద్దరు పిల్లలతో బ్యారేజి వద్దకు చేరుకొని పిల్లలను నదిలోకి వేయటానికి ప్రయత్నిస్తున్నక్రమంలో నలువైపుల నుంచి పోలీసులు అక్కడకు చేరుకొని ఆమెను నిలువరించారు. పిల్లలతో సహా ఆమెను కాపాడి గుంటూరు ఎస్పీ కార్యాలయానికి తీసుకువచ్చారు. హసీనాతోపాటు ఆమె భర్త సుభానీలను ఎస్పీ తన కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. తల్లి నూర్జహాన్‌కు తన కుమార్తె హసీనా ఆమె పిల్లలను అప్పగించారు. ముగ్గురు ప్రాణాలు కాపాడిన పోలీసులకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

చెత్త పన్ను తొలగింపుపై హర్షాతిరేకాలు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వం చెత్తపై వేసిన పన్నును ముఖ్యమంత్రి చంద్రబాబు తొలగించడంపై ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయని పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి పేర్కొన్నారు. గుంటూరులో శుక్రవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. పేదల పక్షపాతి చంద్రబాబు అని మరోసారి నిరూపితమైంది. గత ప్రభుత్వం ఇళ్ల నుంచి ప్రతి నెలా చెత్త సేకరణకు పన్ను వసూలు చేసింది. ఈవిధంగా ఏడాదికి రూ.200 కోట్లు దోచేసింది. దీనిని వ్యతిరేకిస్తూ తెదేపా అప్పట్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించింది. చంద్రబాబు.. తాము అధికారంలోకి వస్తే.. చెత్త పన్ను రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు ఆ హామీని నెరవేర్చారు. ఇది మంచి ప్రభుత్వం అనడానికి ఇదే నిదర్శనం'.. అని పేర్కొన్నారు.

'శిక్ష అనుభవించేందుకు సిద్ధంగా ఉండాలి'

పట్టాభిపురం, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి వినియోగించారన్న అంశంపై సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను స్వాగతిస్తున్నామని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. అయిదుగురు సభ్యులతో కూడిన స్వతంత్ర సిట్ ఏర్పాటుతో అసలు విషయాలు బయటకు వస్తాయి. జగన్ పాలనలో తిరుమల కొండను అపవిత్రం చేశారు. అర్హత లేని కంపెనీలకు నెయ్యి టెండర్లు ఎలా ఇచ్చారు. ఇకనైనా శిక్ష అనుభవించేందుకు సిద్ధంగా ఉండాలి'.. అని హితవు పలికారు.

నేటి అలంకారం శ్రీ అన్నపూర్ణా దేవి

5-10-2024, శనివారం



ఉర్వీ సర్వ జయేశ్వరీ జయకరీ మాతాకృపాసాగరీ నారీ నీలసమాన కుంతలధరీ నిత్యాన్నదానేశ్వరీ సాక్షాన్ మోక్షకరీ సదా శుభకరీ కాశీ పురాధీశ్వరీ భిక్షాందేహి కృపావలంబనకరీ మాతాన్నపూర్ణేశ్వరీ॥

చేతిలో రసపాత్రను ధరించి, పరమేశ్వరునికి భిక్ష పెడుతున్న భంగిమలో అన్నపూర్ణాదేవి భక్తులకు దర్శనమిస్తుంది. సకల చరాచర సృష్టికి ప్రాణాధారమైన అన్నం ఈ తల్లి దయవల్లనే లభిస్తుంది. అందుకే అన్నం పరబ్రహ్మ స్వరూపం అని పెద్దలు చెబుతారు. ఈ రూపంలో ఆది పరాశక్తిని అర్చిస్తే బుద్ధివికాసం, సమయస్ఫూర్తి, బుద్ధి కుశలత, వాక్‌సిద్ధి, శుద్ధి కలుగుతాయి. మానవుల్ని సంపూర్ణంగా ఈ తల్లి అనుగ్రహిస్తుంది. అమ్మ ధరించిన అక్షయపాత్ర సకల శుభాలను అందిస్తుంది. నిత్యం ఆకలి తీర్చడానికి ఆదిపరాశక్తి స్వయంగా అన్నపూర్ణాదేవిగా రావడం ఈ అవతార విశేషం. పరిపూర్ణమైన చిత్తంతో ఆరాధించిన వారి సమస్తపోషణా భారాన్ని ఈమె స్వయంగా వహిస్తుంది. ఓం శ్రీం హ్రీం క్లీం నమో భగవత్యన్నపూర్ణే మమాభిలషిత మహిదేహ్యన్నం స్వాహా అనే మంత్రాన్ని జపించి అమ్మకు నివేదన చేయాలి. తెల్లని వస్త్రాలు ధరించి, తెల్లని పుష్పాలతో పూజించాలి. అన్నపూర్ణ స్తోత్రాలు చదవాలి. భోజనశాలలో ఈ తల్లి చిత్రపటం ఉంచి, హారతులు ఇవ్వాలి.

మధురం.. మనోహారం

దుర్గమ్మ లడ్డూ అత్యంత ప్రీతిపాత్రం



ఈ ఏడాది కొత్తగా స్వీటు బాక్సు మోడల్ ప్యాకింగ్





లడ్డూలు చుట్టడంలో నిమగ్నమైన సిబ్బంది



1 శనగపిండి కలుపుతూ...



2 కలిపిన శనగపిండి నూనెలో వేసి బూందీ తయారీ



3



4 పొయ్యిపై పానకం మరగబెడుతూ



5 అప్పటికే సిద్ధం చేసిన బూందీలో పానకాన్ని పోసి..

బూందీలో పానకం పోశాక కలుపుతూ...



6 అన్నీ కలిపాక లడ్డూ తయారీకి సిద్ధం..



7



విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారి నేతి లడ్డూ ప్రసాదం అంటే భక్తులకు అత్యంత ప్రియం. తిరుపతి నేతి లడ్డూ తర్వాత ఆస్థాయిలో భక్తులు భారీగా కొనుగోలు చేసేది దుర్గమ్మ ప్రసాదాన్నే. ఏటా దసరా శరన్నవరాత్రోత్సవాల్లో 20 లక్షలకు పైగా లడ్డూలను భక్తులు కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు. ఈ ఏడాది కూడా అక్టోబరు 03 నుంచి 12 వరకు జరుగుతున్న దసరా ఉత్సవాల్లో అమ్మవారి ప్రసాదాన్ని భారీగా తయారుచేస్తున్నారు. తొమ్మిది రోజుల దసరా వేడుకలు, ఆ తర్వాత రెండు రోజులు భవానీ దీక్షాదారుల రాక సందర్భంగా మొత్తం 25 లక్షల లడ్డూ ప్రసాదాన్ని సిద్ధం చేస్తున్నారు.

– ఈనాడు, అమరావతి, – న్యూస్‌టుడే, ఇంద్రకీలాద్రి

రుచిలో ఏమాత్రం తేడా లేకుండా..


అమ్మవారి నేతి లడ్డూ తయారీకి ప్రధానంగా ఉపయోగించే శనగపిండిని సొంతంగా దేవస్థానం ఆధ్వర్యంలోనే తయారుచేస్తారు. నాణ్యమైన శనగపప్పును కొనుగోలు చేసి దానిని మిల్లులో ఆడించి సొంతంగా పిండిని సిద్ధం చేస్తారు. ఈ పిండిని నీటిలో ముద్దగా కలిపి నేతిలో వేయించి బూందీ తయారుచేస్తారు. ఇందుకు నాణ్యమైన విజయ డెయిరీ నెయ్యిని వినియోగిస్తారు. ఆ తర్వాత పంచదార పాకంలో ఈ బూందీని వేసి కొంత సమయం నానబెడతారు. బూందీ పాకంలో నాని.. ఉబ్బిన తర్వాత.. దానిలో యాలకుల పొడి, జీడిపప్పు, కిస్మిస్‌ను కలుపుతారు. జీడిపప్పును కలిపే ముందు నేతిలో దోరగా వేయిస్తారు. ఆ తర్వాత బాగా కలిపి లడ్డూ పోటును సిద్ధం చేస్తారు. దానిలో పచ్చ కర్పూరం సరిపోయినంత వేస్తారు. లడ్డూకు మంచి వాసన రావడంతోపాటు ఎక్కువ రోజులు పాడవకుండా ఉండేందుకు పచ్చ కర్పూరాన్ని కలుపుతారు. ఈ మొత్తం ప్రక్రియలో ఎక్కడా ఎలాంటి పొరపాటు లేకుండా లడ్డూ నాణ్యత, రుచి ఒకేలా ఉండేలా ఏడాది పొడవునా తయారుచేయడం గొప్ప విషయం.




యాలకుల పొడి



పటిక బెల్లం చిప్స్



జీడిపప్పు



కిస్మిస్



పచ్చ కర్పూరం

లడ్డూ ప్రసాదం 80, 400 గ్రాముల్లో రెండు రకాలుగా తయారుచేస్తుంటారు. ఈ లడ్డూల తయారీలో సుశిక్షితులైన 250 మందికి పైగా సిబ్బంది పాల్గొంటారు. ప్రసాదం పోటు తయారీ దగ్గర నుంచి లడ్డూలను చుట్టే వరకూ ప్రతి దశలో చాలా జాగ్రత్తలు తీసుకుంటారు. లడ్డూ పోటును తయారుచేశాక పెద్ద పెద్ద ప్లేట్లలో ఉంచి.. దానిపై చిన్న పంచదార పటిక ముక్కలు వేసి.. ఆ తర్వాత ఉండలుగా చుట్టి.. ప్యాకింగ్ చేస్తారు. సాధారణ కౌంటర్లలో విక్రయించే లడ్డూలు 80 గ్రాములు, ప్రత్యేకంగా పూజలు, ప్రముఖులకు ఇవ్వడానికి 400 గ్రాముల లడ్డూలను సిద్ధం చేస్తున్నారు.

100 కిలోల పిండికి.. 5,640 లడ్డూలు..

- ★ శనగపిండి: 100 కిలోలు
- ★ పంచదార: 200 ”
- ★ నెయ్యి: 60 ”
- ★ జీడిపప్పు: 7.5 ”
- ★ కిస్మిస్: 5 ”
- ★ యాలకల పొడి:750 గ్రాములు
- ★ పచ్చ కర్పూరం: 150 ”
- ★ లడ్డూ బరువు: 80 ”

ధనలక్ష్మిగా జగన్మాత



తెనాలి (కొత్తపేట): దసరా నవరాత్రుల సందర్భంగా శుక్రవారం పట్టణంలోని మారీసుపేట, బోసురోడ్డులో కొలువైన బాలాత్రిపుర సుందరీ సమేత శ్రీ చంద్రమౌళీశ్వరస్వామి, వాసవీ కన్యకాపమేశ్వరి దేవస్థానాల్లో అమ్మవారు భక్తులకు ధనలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గ్రంధిసేతు మాధవరావు, సత్రం కమిటీ పాలకవర్గం అధ్యక్షుడు నూకల వెంటక వేణుగోపాలరావు పాల్గొన్నారు.

తెనాలి మారీసుపేట బాలాత్రిపుర సుందరీ సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో రూ.70 లక్షల కరెన్సీ నోట్లతో అమ్మవారి అలంకరణ

ఆస్పత్రుల్లో సహాయకులకు నైపుణ్య శిక్షణ

ఈనాడు, అమరావతి: ఆస్పత్రుల్లో రోగుల పడకల వద్ద సహాయకులుగా పని చేసే వారికి అవసరమైన నైపుణ్య శిక్షణ అందించేందుకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ శ్రీసత్యసాయి సేవా ట్రస్టుతో ఒప్పందం కుదుర్చుకుంది. తాడేపల్లిలోని నైపుణ్యాభివృద్ధి సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఈ ఒప్పందం జరిగింది. దీని ప్రకారం పదో తరగతి ఉత్తీర్ణులు, ఇంటర్మీడియట్, అండర్ గ్రాడ్యుయేట్ చదువు మధ్యలో నిలిపివేసిన వారు, నిరుద్యోగ యువతకు ఈ శిక్షణ ఇవ్వనున్నారు. ఆన్ జాబ్ శిక్షణతో కలిపి మొత్తం ఐదు నెలలు ఈ కోర్సు ఉంటుంది. శిక్షణ పూర్తయిన తర్వాత ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఒప్పందం కుదుర్చుకునే కార్యక్రమంలో శ్రీసత్యసాయి సేవా ట్రస్ట్ ట్రస్టీ జి.సాయి విశ్వనాథం, ఏపీఎస్ఎస్‌డీసీ ఈడీ దినేష్‌కుమార్, నర్సింగ్ నైపుణ్యాభివృద్ధి అధికారి రేహానాఖాన్ పాల్గొన్నారు.

‘ఆ జీఓను వెనక్కు తీసుకోవాలి’

ఈనాడు, అమరావతి: ఎసైన్డ్ భూముల్లో ఇసుక తవ్వుకోవడానికి అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీఓను వెనక్కి తీసుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ప్రభుత్వం పేదలకిచ్చిన ఎసైన్డ్ భూముల్లో మైనింగ్ తవ్వరాదని, ఆక్వా సాగు చేయకూడదని.. పేదలు, వారి కుటుంబాలు తరతరాలుగా ఆ భూమిని అనుభవించాలని చట్టం చెబుతోందని పేర్కొన్నారు. ఈ చట్టాన్ని ఉల్లంఘించి రాష్ట్ర ప్రభుత్వం చేసిన నిర్ణయం దళితులు, పేదలకు వ్యతిరేకమైందని, ఇప్పటికే లక్షల ఎకరాల పేదల భూములను పెత్తందార్లు దౌర్జన్యంగా, అక్రమంగా అనుభవిస్తున్నారని ఆరోపించారు.

పన్నెండోసారి బెంగళూరుకు జగన్

ఈనాడు, అమరావతి: మాజీ సీఎం, వైకాపా అధ్యక్షుడు జగన్ శుక్రవారం మరోసారి బెంగళూరుకు వెళ్లారు. గత నెల 28న బెంగళూరుకు వెళ్లిన ఆయన మంగళవారం తిరిగొచ్చారు. మూడు రోజులకే మళ్లీ అక్కడికే పయనమయ్యారు. ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక జగన్ బెంగళూరుకు వెళ్లడం ఇది 12వ సారికావడం గమనార్హం.



ఫలితాలను తీసుకొచ్చేది పని మాత్రమే

మీరు బలంగా కోరుకున్నంత మాత్రాన ఏదీ మీకు దక్కదు. విద్య, సామర్థ్యాల్లాంటి అర్హతలు ఉన్నంత మాత్రాన ఏవీ వచ్చి మీ ఒళ్లో వాలవు. అమోఘమైన తెలివితేటలు మీకున్నా అన్నీ మీ దరి చేరవు. మీరు వేటి కోసమైతే నిజంగా కష్టపడి పనిచేస్తారో అవి మాత్రమే మిమ్మల్ని వరిస్తాయి. ఫలితాలను తీసుకొచ్చేది ఆశలు, ఆకాంక్షలు కాదు.. అంకితభావంతో స్థిరంగా పనిచేసే గుణమే.

– కోరీ విల్సన్, బిజినెస్ కన్సల్టెంట్

ఉన్నత విద్యలో ఆన్‌లైన్ పరీక్షల విధానం

- విశ్వవిద్యాలయాల్లో ఆన్‌లైన్‌లోనే ప్రశ్నపత్రాల రూపకల్పన
- కంప్యూటర్‌లో జవాబుపత్రాల మూల్యాంకనం
- మార్కులు ట్యాంపరింగ్ చేయకుండా పారదర్శకతకు ప్రభుత్వం చర్యలు

ఈనాడు, అమరావతి: విశ్వవిద్యాలయాల్లో పరీక్షల విధానాన్ని కంప్యూటరీకరణ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. డిగ్రీ, పీజీ పరీక్షల ఫలితాల్లో పారదర్శకత, మార్కుల్లో కచ్చితత్వం, పరీక్షల నిర్వహణను పటిష్ఠం చేసేందుకు ఈ విధానాన్ని తెస్తోంది. రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో ‘సమగ్ర పరీక్షల నిర్వహణ విధానం’ అమలు చేయనుంది. గతంలో కాగ్ సైతం ప్రశ్నపత్రాల మూల్యాంకనంలో లోపాలు ఉన్నట్లు బహిర్గతం చేసింది. మొదట పరీక్షల్లో తప్పినా, పునర్ మూల్యాంకనంతో ఉత్తీర్ణులవుతున్న వారి సంఖ్య కొన్ని వర్సిటీల్లో 40% వరకు ఉంటోంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీలో గతంలో బీఈడీలో 52 మంది పునర్ మూల్యాంకనానికి దరఖాస్తు చేస్తే వీరిలో 30 మంది మార్కులు మారాయి. పీజీలో ఒక కోర్సుకు 80 మంది దరఖాస్తు చేస్తే 52 మందికి మార్కులు పెరిగాయి. ఆంధ్ర, ఆదికవి నన్నయ, ఎస్వీ యూనివర్సిటీల్లో పునర్ మూల్యాంకనం బాగోలేదని గతంలో కాగ్ హెచ్చరించింది. విశ్వవిద్యాలయాల్లో పరీక్షల నిర్వహణ విభాగానికి, ఇతర విభాగాలకు మధ్య సమన్వయం లేదు. గతంలో నాగార్జున వర్సిటీలో కొన్ని బీఈడీ కళాశాలలకు ప్రవేశాలకు అనుమతులు లేకపోయినా పరీక్షల విభాగం పరీక్షలు నిర్వహించి, ఫలితాలు ఇచ్చినట్లు ఆరోపణలున్నాయి. వర్సిటీల్లో ఇలాంటి పరిస్థితులను చక్కదిద్దే ప్రయత్నాలు మొదలయ్యాయి.

ఆన్‌లైన్ మూల్యాంకనం..

కొత్తగా తెచ్చే సంస్కరణల్లో భాగంగా ప్రశ్నపత్రాల మూల్యాంకనాన్ని ఆన్‌లైన్ చేయనున్నారు. పరీక్షలు పూర్తయ్యాక జవాబుపత్రాలను స్కానింగ్ చేస్తారు. అభ్యర్థి పేరు లేకుండా వీటికి కోడ్ కేటాయిస్తారు. అనంతరం వీటికి పాస్‌వర్డ్ పెడతారు. వర్సిటీల్లో ఈ విభాగం చూసే అధికారులు జవాబుపత్రాలను మూల్యాంకనం కోసం ఆన్‌లైన్‌లోనే అధ్యాపకులకు పంపిస్తారు. వారు కంప్యూటర్‌లోనే మూల్యాంకనం చేసి, సబ్మిట్ చేయగానే సంబంధిత అధికారికి ఇవి వస్తాయి.

★ మార్కులు రాగానే ఆటోమేటిగ్గా ఆయా వర్సిటీల లోగో, నమూనాతో మెమోల్లోకి ఈ మార్కులు వచ్చేస్తాయి. వీటిని డిజి లాకర్‌కు అనుసంధానిస్తారు. అభ్యర్థులు తమ మార్కుల మెమోలను డిజి లాకర్ నుంచి నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

★ పునర్ మూల్యాంకనానికి దరఖాస్తు చేసేవారికి అవసరమైతే వారు రాసిన జవాబుపత్రాలను అందించే అవకాశం ఉంటుంది. మూల్యాంకనం సైతం తొందరగా పూర్తవుతుంది. ఏటా అన్ని వర్సిటీల పరిధిలో 8 లక్షల మంది పరీక్షలు రాస్తున్నారు.

ప్రశ్నల బ్యాంకు ఏర్పాటు

ప్రశ్నపత్రాలనూ కంప్యూటర్ ద్వారానే రూపొందిస్తారు. సబ్జెక్టుల వారీగా ప్రశ్నలబ్యాంకును ఏర్పాటు చేస్తారు. వాటిలో నుంచి ఆన్‌లైన్‌లోనే ప్రశ్నపత్రం రూపొందిస్తారు. ప్రశ్నపత్రాలను ఆన్‌లైన్‌లో పంపించాలని భావిస్తున్నా క్షేత్రస్థాయి పరిస్థితుల కారణంగా మొదట్లో కొంతకాలం ముద్రించిన ప్రశ్నపత్రాలను పంపాలని నిర్ణయించారు. ప్రశ్నపత్రాలను ముద్రించడం, వాటిని సరఫరా చేయడం లాంటివి లేకుండా పరీక్షకు 15 నిమిషాల ముందు ప్రశ్నపత్రాన్ని ఆన్‌లైన్‌లో పాస్‌వర్డ్‌తో పంపించి, వాటిని ప్రింట్లు తీసుకొని, అభ్యర్థులకు ఇచ్చే విధానంపై ఆలోచన చేస్తున్నారు.

★ వర్సిటీల్లో పరీక్షల విభాగం కంప్యూటరీకరణ ప్రక్రియ కోసం ప్రైవేటు సాఫ్ట్‌వేర్ సంస్థలను ఎంపిక చేసేందుకు ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ ద్వారా ఉన్నత విద్యాశాఖ టెండర్లు పిలిచింది. ఈ నెల 15 వరకు బిడ్లు స్వీకరిస్తుంది. సంస్థలను ఎంపిక చేశాక ఉన్నత విద్యాశాఖ వర్సిటీలకు కేటాయించనుంది.

కర్ణాటకలో లేని ప్రైవేటీకరణ విశాఖలో ఎందుకు?

- ఉక్కు పరిశ్రమకు సొంత గనులు కేటాయించాలి
- సీపీఐ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణపై రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షురాలు షర్మిల. చిత్రంలో మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తదితరులు

ఈనాడు డిజిటల్, అమరావతి: కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి తన రాష్ట్రంలోని మూతపడిన ఫ్యాక్టరీని తిరిగి ప్రారంభించుకున్నారని, 23 మంది ఎంపీలు ఉన్నా.. ఎన్డీయే ప్రభుత్వం విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఎందుకు అడ్డుకోవడంలేదని వక్తలు ప్రశ్నించారు. పదేళ్లుగా రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా భాజపాకే మద్దతిచ్చాయని, ఒక్క విభజన హామీని అమలు చేయకున్నా ఊడిగం చేశాయని మండిపడ్డారు. విజయవాడలోని సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నేతలతో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఫ్యాక్టరీకి సొంత గనులు కేటాయిస్తే అదే లాభాల్లోకి వస్తుందని అన్నారు. ప్రైవేటీకరణ ఆలోచన మానుకోవాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి లేఖ అందించాలని నిర్ణయించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల మాట్లాడుతూ.. ‘ప్రస్తుతం భాజపా కేంద్రంలో అధికారంలో ఉండటానికి కారణం తెదేపా ఎంపీలే. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వారు ఎందుకు మాట్లాడటంలేదు. కాంగ్రెస్ పార్టీ చిల్లర రాజకీయాలు చేస్తోందని ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి అంటున్నారు. కానీ అవి చేసేది భాజపానే. యూపీఏ అధికారంలో ఉన్నన్ని రోజులూ ఫ్యాక్టరీ లాభాల్లోనే ఉంది. భాజపా అధికారంలోకి వచ్చాకే అప్పుల పాలైంది’ అని విమర్శించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ.. ‘ప్రైవేటీకరణ చేయాలనేది రాజకీయ నిర్ణయం. 10 ఏళ్లుగా ఆందోళనలు చేస్తున్నా.. ప్రైవేటీకరణే మా విధానమని నేరుగా చెబుతున్నారు. ప్రతిపక్ష నేతలుగా మాట్లాడే హక్కు మాకుంది. రాజకీయ పార్టీలు, నాయకులు, విద్యార్థులు, మేధావులు దీనిపై మాట్లాడాలి. భాజపా నాయకులు ప్రైవేటీకరణ చేస్తామని చెబుతుంటే తెదేపా, జనసేన పార్టీలు మాత్రం రోజుకో మాట మాట్లాడుతున్నాయి’ అని మండిపడ్డారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ ‘విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు గనులు కేటాయిస్తే ఏటా రూ.3వేల కోట్ల లాభాలు ఆర్జిస్తుంది. ప్రకాశం జిల్లా టంగుటూరు మండలంలోని మర్లపాడులో సుమారు 1,300 ఎకరాల్లోని గనులను జిందాల్ కంపెనీకి కేటాయించారు. వాటిని విశాఖ ఉక్కు పరిశ్రమకు కేటాయించాలి’ అని కోరారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ‘ప్రైవేటీకరణ చేయడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అందుకే ప్లాంట్‌కు రావాల్సిన గనులను తొలగిస్తోంది. ప్రైవేటీకరణ చేసి అదానీకి అప్పజెప్పాలని చూస్తోంది’ అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు నర్సింగరావు, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

దర్యాప్తునకు సహకరించండి

- వైకాపా నేత సజ్జలకు హైకోర్టు ఆదేశం
- ముందస్తు బెయిలు పిటిషన్‌పై విచారణ 25కు వాయిదా

ఈనాడు, అమరావతి: తెదేపా కేంద్ర కార్యాలయంపై మూకుమ్మడి దాడి కేసులో దర్యాప్తునకు సహకరించాలని వైకాపా నేత సజ్జల రామకృష్ణారెడ్డిని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 25కు వాయిదా వేసింది. అప్పటి వరకు ఆయన అరెస్టు విషయంలో తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులకు స్పష్టంచేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ శుక్రవారం ఈమేరకు ఉత్తర్వులు జారీచేశారు. తెదేపా కార్యాలయంపై దాడి కేసులో తనను నిందితుడిగా చేర్చారని, వాస్తవానికి ఈ వ్యవహారంతో తనకు సంబంధం లేదని, ముందస్తు బెయిలు మంజూరు చేయాలని కోరుతూ సజ్జల రామకృష్ణారెడ్డి హైకోర్టులో వ్యాజ్యం వేసిన విషయం తెలిసిందే. సజ్జల రామకృష్ణారెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. తెదేపా కార్యాలయంపై దాడి ఘటన రోజున పిటిషనర్ పోరుమామిళ్లలో, ఘటనా స్థలానికి 600 కి.మీ దూరంలో ఉన్నారని కోర్టుకు నివేదించారు. ప్రాసిక్యూషన్ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా, పీపీ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపించారు.

దాడి ఘటన రోజు సజ్జల రామకృష్ణారెడ్డి తాడేపల్లి వైకాపా కార్యాలయంలో ఉన్నట్లు ఇద్దరు సహ నిందితులు, ఇద్దరు సాక్షులు వాంగ్మూలాలు ఇచ్చారని తెలిపారు. దేవినేని అవినాష్ అనుచరుడు, ఈ కేసులో 13వ నిందితుడు షేక్ సైదా ఇచ్చిన వాంగ్మూలంలో ఆ రోజు సాయంత్రం 3 గంటలకు వైకాపా కార్యాలయంలో పిటిషనర్‌ను చూసినట్లు వెల్లడించారన్నారు. సజ్జల ప్రోద్బలంతోనే దాడి చేసినట్లు షేక్ సైదా చెప్పారని తెలిపారు. దాడి ఘటనలో సజ్జల రామకృష్ణారెడ్డి పాత్ర ఉన్నట్లు ఆధారాలు లభించాయని పేర్కొన్నారు.

నందిగం సురేష్‌కు షరతులతో బెయిలు

దర్యాప్తునకు అందుబాటులో ఉండాలన్న హైకోర్టు

ఈనాడు, అమరావతి: తెదేపా కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో వైకాపా మాజీ ఎంపీ నందిగం సురేష్, వైకాపా సానుభూతిపరుడు అవుతు శ్రీనివాసరెడ్డిలకు హైకోర్టు షరతులతో కూడిన రెగ్యులర్ బెయిలు మంజూరు చేసింది. మంగళగిరి మొదటి తరగతి అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో రూ.15వేలతో రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించింది. అభియోగపత్రం దాఖలు చేసేవరకూ ప్రతి నెలా 1, 15వ తేదీల్లో ఉదయం పది నుంచి మధ్యాహ్నం 1 గంటలోపు ఏదో ఒక సమయంలో దర్యాప్తు అధికారి (ఐఓ) ముందు హాజరుకావాలని ఇద్దరినీ ఆదేశించింది. దర్యాప్తు నిమిత్తం పోలీసులు కావాలన్నప్పుడల్లా అందుబాటులో ఉండాలని పిటిషనర్లకు తేల్చిచెప్పింది. ఈ కేసులో ఎవరినీ ప్రలోభపెట్టడం, బెదిరించడం చేయవద్దని ఆదేశించింది. ఇలాంటి నేర ఘటనలను పునరావృతం చేయవద్దని స్పష్టం చేసింది. దిగువ కోర్టులో విచారణ ప్రక్రియలో పాల్గొనాలని పేర్కొంది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ శుక్రవారం ఈ మేరకు తీర్పు చెప్పారు.

★ పోలీసులకు నందిగం సురేష్ మొబైల్ ఫోన్లను అప్పగించకపోవడాన్ని దర్యాప్తునకు సహకరించనట్లుగా చెప్పలేమని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. పిటిషనర్లను సెప్టెంబరు 4న అరెస్టు చేశారని, నెల రోజులుగా జ్యుడిషియల్ కస్టడీలో ఉన్నారని గుర్తుచేశారు. పోలీసు కస్టడీ పూర్తయిందన్నారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని బెయిలు మంజూరు చేస్తున్నట్లు న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు.

ఏఆర్ డెయిరీ ఎండీ ముందస్తు బెయిలు పిటిషన్ 17కు వాయిదా

ఈనాడు, అమరావతి: ఏఆర్ డెయిరీ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎండీ ఆర్.రాజశేఖరన్ హైకోర్టులో దాఖలు చేసిన ముందస్తు బెయిలు పిటిషన్‌పై విచారణ ఈ నెల 17కు వాయిదా పడింది. శ్రీవారి లడ్డూ తయారీకి జంతువుల కొవ్వుతో కల్తీ చేసిన నెయ్యి సరఫరా చేశారన్న ఆరోపణలతో తనపై తిరుపతి తూర్పు ఠాణాలో సెప్టెంబరు 25న నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిలు మంజూరుచేయాలని రాజశేఖరన్ హైకోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. శుక్రవారం నాటి విచారణలో పిటిషనర్ తరఫు న్యాయవాది స్పందిస్తూ.. లడ్డూ విషయమై సుప్రీంకోర్టులో చోటుచేసుకున్న పరిణామం నేపథ్యంలో తమ పిటిషన్‌ను ఈ నెల 17కు వాయిదా వేయాలని కోరారు. అందుకు అంగీకరించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ విచారణను వాయిదా వేశారు.